తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం-11-జూలై-2025 | సంపుటి : 3 | సంచిక : 45 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# బీసీలకు 42% రిజర్వేషన్లు

## పంచాయతీరాజ్ చట్ట సవరణకు కేబినెట్ ఆమోదం

- బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం చట్ట సవరణ
- కులగణన ఆధారంగా నిర్ణయం
- ప్రభుత్వం కాలయాపన చేస్తోంది
- న్యాయపరంగా సమస్యలుండకూడదన్న దృష్టితో
- పార్టీల సహకారం అవసరం
- శాతం పరిమితి ఇక అమలులో లేదు
- ఇప్పటివరకు 96 శాతం నిర్ణయాల అమలు
- ప్రతి మూడు నెలలకు సమీక్ష
- రాష్ట్ర విద్యార్థులకు 50 శాతం సీట్లు
- లక్ష ఉద్యోగాల భర్తీకి కార్యాచరణ
- సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం
- స్థానిక ఎన్నికల్లో బీసీలకు విభజనల ప్రకారం రిజర్వేషన్లు
- జిన్నారం, ఇంద్రేశం పరిధిలో 18 గ్రామాల డీ లిస్టింగ్
- నాలుగు చోట్ల అత్యాధునిక గోశాలలు
- గోశాలల కోసం సమగ్ర విధాన పత్రం
- మత్స్యకారుల కోసం చేప పిల్లల విడుదల
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాల సేకరణ



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వే ఆధారంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ మేరకు బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పంచాయతీరాజ్ చట్టం-2018 సవరణకు త్వరలో ఆర్డినెన్స్ తీసుకురావాలని తీర్మానించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో సమావేశమైన కేబినెట్.. పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. భేటీ అనంతరం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి విలేకరులకు వివరాలు వెల్లడించారు.

మిగతా 2లో..



హ్యామ్ మోడల్‌లో రూ.22 వేల కోట్లతో 2,627 రహదారుల అభివృద్ధికి

# టెండర్ల ప్రక్రియా ప్రారంభం

- హ్యామ్ రోడ్లకు ఎన్హెచ్ఏఐ నిబంధనల ప్రకారం టెండర్లు
- జిల్లా కేంద్రాలను అనుసంధానించే ప్రాధాన్య రహదారులకు తొలి ప్రాధాన్యత
- 373 ఆర్‌అండ్‌బీ, 2,254 పంచాయతీరాజ్ రహదారులు మొదటి దశలో
- రూ.22 వేల కోట్ల అంచనా వ్యయంతో 17 ప్యాకేజీలుగా పనుల విభజన



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఎన్‌హెచ్ఏఐ నిబంధనలకు అనుగుణంగా హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రోడ్లను నిర్మిస్తామని రాష్ట్ర రోడ్లుభవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

2లో..



# కల్తీ కల్లు ఘటనపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

- కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనపై స్పందించిన మాజీ మంత్రి కేటీఆర్
- మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్
- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సూచన
- ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని స్పష్టీకరణ



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

కూకట్‌పల్లిలో వెలుగుచూసిన కల్తీ కల్లు ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన అత్యంత బాధాకరమని పేర్కొంటూ, బాధితుల పట్ల ప్రభుత్వం అనుసరించాల్సిన వైఖరిపై స్పష్టమైన డిమాండ్లు చేశారు. అదే సమయంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై సామాజిక మాధ్యమ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. కల్తీ కల్లు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

మిగతా 2లో..

## పవన్ కల్యాణ్, బాలకృష్ణ బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ చేశారు

- పవన్, బాలకృష్ణలపై విచారణ ఎందుకు జరపడం లేదని కేఏ పాల్ ప్రశ్న
- బీజేపీతో పొత్తు వల్లే దర్యాప్తు సంస్థలు మౌనం వహిస్తున్నాయని విమర్శ
- రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని మండిపాటు

4లో..



# ఇందిరమ్మ ఇళ్ల'లో ఎంపీలకు 40 శాతం కోటా ఇవ్వండి

- రేవంత్ కు రఘునందన్ లేఖ
- పార్టీలకు అతీతంగా 17 మంది ఎంపీలకు ఈ అవకాశం కల్పించాలని సూచన
- దీనివల్ల లబ్ధిదారుల ఎంపిక మరింత పారదర్శకంగా ఉంటుందని వ్యాఖ్య



# ఫోన్ ట్యాపింగ్ కేసులో ఢిల్లీకి సిట్ అధికారులు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామాలు
- ఐదు సార్లు సుమారు నలభై గంటలపాటు ప్రభాకర్‌రావును విచారించిన సిట్



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి సిట్ అధికారులు ఢిల్లీకి వెళ్లారు. వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్, సిట్ అధికారి ఏసీపీ వెంకటగిరి ఢిల్లీకి చేరుకున్నారు. ఇప్పటివరకూ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావును సిట్ అధికారులు ఐదుసార్లు విచారించారు. ఐదు సార్లు సుమారు నలభై గంటల పాటు ప్రభాకర్‌రావును విచారించింది సిట్. అయితే విచారణలో సమాధానాలు చెప్పకుండా అధికారుల సహనాన్ని పరీక్షించారు ఎస్ఐబీ మాజీ చీఫ్. ఈ క్రమంలో ప్రభాకర్ రావు విచారణకు సహకరించకపోవడంతో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు.

మిగతా 4లో..



# చేనేత రుణమాఫీ నిధులు వెంటనే జమ చేయండి

- రుణమాఫీ కోసం రూ. 33 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- రాష్ట్ర వ్యాప్తంగా 5,691 మంది కార్మికులకు లబ్ధి
- ప్రభుత్వ వస్త్రాల ఆర్డర్లను వేగవంతం చేయాలని తుమ్మల సూచన

2లో..

# హైదరాబాద్‌లో వైన్ షాపులు బంద్

- మందు బాబులకు తెలంగాణ ప్రభుత్వం షాక్
- రెండు రోజుల పాటు వైన్ షాపులు బంద్ చేస్తున్నట్లు వెల్లడి
- హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ గురువారం ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

మందు బాబులకు తెలంగాణ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. రెండు రోజుల పాటు వైన్ షాపులు బంద్ చేస్తున్నట్లు వెల్లడిరచింది. హైదరాబాద్ మహానగరంలోని సికింద్రాబాద్‌లో బోనాల సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ఈ మేరకు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జులై 13వ తేదీ ఉదయం 6:00 నుండి 15వ తేదీ ఉదయం 6:00 గంటల వరకు సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ హైదరాబాద్ పరిధిలోని వైన్స్ షాపులు, బార్లు బంద్ ఉంటాయని జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి జాతర (బోనాలు) సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

మిగతా 4లో..



# మల్నాడు కిచెన్ డ్రగ్స్ కేసులో విస్తుపోయే నిజాలు

20 పబ్బులకు ఇప్పటి వరకు డ్రగ్స్ సప్లై అయినట్లు వెల్లడి

హైదరాబాద్ : మల్నాడు కిచెన్ డ్రగ్స్ కేసులో మరికొన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొరియర్ల ద్వారా డ్రగ్స్‌ను మల్నాడు కిచెన్‌కు వచ్చినట్లు ఈగల్ టీమ్ విచారణలో బయటపడిరది.

మిగతా 4లో..



శుక్రవారం-11- జూలై 2025

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బీసీలకు 42% రిజర్వేషన్లు

(మొదటి పేజీ తరువాయి)




రాహుల్ గాంధీ ఇచ్చిన హామీతో పాటు కామారెడ్డి సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం రాష్ట్రంలో కుల గణన నిర్వహించడాన్ని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును శాసనసభలో ఆమోదించి, గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించిన విషయం గుర్తు చేశారు.

సీఎం, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, ఇతర మంత్రులు ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ పలువురు కేంద్రమంత్రులు, సంబంధిత అధికారులతో దీనిపై అనేకసార్లు చర్చించినా కొర్రీలు వేస్తూ కాలయాపన చేశారని విమర్శించారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ భేటీకి అడ్వొకేట్ జనరల్‌ను కూడా ఆహ్వానించి ఆయన సలహాలు తీసుకుని, న్యాయపరమైన చిక్కులు రాకుండా బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

ఎన్నికలకు ఇబ్బందులు ఎదురవకుండా రాజకీయ పార్టీలు కూడా చిత్తశుద్ధితో సహకరించాలని మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి ఇప్పటికే రాష్ట్రంలో 62 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని, రిజర్వేషన్లపై 50 శాతం క్యాప్ నిబంధన దేశంలో ఎప్పుడో పోయిందని అన్నారు.

**కేబినెట్ నిర్ణయాలు 96% అమలు**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక దీనికి ముందు వరకు జరిగిన 18 మంత్రివర్గ సమావేశాల్లో 327 అంశాలపై చర్చించి 321 అంశాలపై నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. తాజాగా జరిగిన 19వ సమావేశంలో ఆ నిర్ణయాల అమలులో పురోగతిపై విస్తృతంగా చర్చించామని, 96 శాతం అంశాలకు సంబంధించి జీవోలు జారీ చేసి అమలు దశకు తీసుకెళ్లినట్టు తేలిందని చెప్పారు.

కాగా ప్రతి రెండు వారాలకు ఒకసారి కేబినెట్ సమావేశం నిర్వహించాలన్న ప్రభుత్వ ఆలోచన మేరకు మళ్లీ ఈ నెల 25న మంత్రివర్గ భేటీ జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి 3 నెలలకోసారి ఆ కాల వ్యవధిలో జరిగే ఆరు కేబినెట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును సమీక్షించాలని కూడా నిర్ణయించామని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు చేరవేసే వ్యవస్థ పనితీరును మళ్లీ కేబినెట్‌లోనే ఇలా సమీక్షించడం దేశంలోనే తొలిసారి అని అన్నారు.

ఈ వర్సిటీల్లో రాష్ట్ర విద్యార్థులకు 50% సీట్లు

రాష్ట్రంలోని అమిటీ, సెయింట్ మేరీస్ రిహాబిలిటేషన్ విద్యా సంస్థలకు వర్సిటీలుగా గుర్తింపు కల్పించాలని కేబినెట్ నిర్ణయించినట్టు పొంగులేటి తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 15 ఉత్తమ వర్సిటీల్లో అమిటీ 11/12వ స్థానంలో ఉందన్నారు.

సెయింట్ మేరీస్ రిహాబిలిటేషన్ యూనివర్సిటీ సైతం అన్ని రంగాల్లో నైపుణ్యాభివృద్ధికి శిక్షణ ఇవ్వనుందని చెప్పారు. సీఎం, డిప్యూటీ సీఎం, సీఎస్ చొరవతో ఈ వర్సిటీల్లో రాష్ట్ర విద్యార్థులకు 50 శాతం సీట్లు కేటాయించడానికి ఆ సంస్థల యాజమాన్యాలు అంగీకరించాయని తెలిపారు.

**మార్చిలోగా మొత్తం లక్ష ఉద్యోగాల భర్తీ**

ఈ ఏడాదిన్నర వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, వీటితో పాటు మరో 17,084 ఉద్యోగాల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉందని పొన్నం చెప్పారు. ఇక కొత్తగా 22,033 ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్లు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని, ఈ మేరకు జాబ్ కేలెండర్ సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. వచ్చే మార్చిలోగా మొత్తం లక్ష ఉద్యోగాలను భర్తీ చేయాలని మంత్రివర్గంలో నిర్ణయించామన్నారు. ఎస్సీల వర్గీకరణ సమస్యతో నోటిఫికేషన్ల జారీలో కొంత జాప్యం జరిగిందని ఆయన వివరించారు.

- రాష్ట్రంలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన మిగులు భూసేకరణను సత్వరం పూర్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. అనంతరం ఆ ప్రాజెక్టుల పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి రైతాంగానికి నీళ్లు ఇవ్వాలని నిర్ణయించినట్టు పొంగులేటి వెల్లడించారు.
- గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీలకు మండలం యూనిట్‌గా, ఎంపీపీ, జెడ్పీటీసీలకు జిల్లా యూనిట్‌గా, జెడ్పీ చైర్మన్లకు రాష్ట్రం యూనిట్‌గా పరిగణించి బీసీ రిజర్వేషన్లు కల్పిస్తారు.
- సంగారెడ్డి జిల్లాలో ఇటీవల కొత్తగా ఏర్పడిన జిన్నారం, ఇంద్రేశం మున్సిపాలిటీల పరిధిలో చేర్చే 18 గ్రామ పంచాయతీలను డీ లిస్టింగ్ చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**4 చోట్ల అత్యాధునిక గోశాలలు**

రాష్ట్రంలో అధునాతనంగా గోశాలల ఏర్పాటు, నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ కమిటీ వచ్చే కేబినెట్ సమావేశంలోపు తమ నివేదికను అందించాలని గడువు నిర్ణయించింది. సీఎం ఆదేశాల మేరకు పశు సంవర్ధక శాఖ రూపొందించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను, కొత్తగా నిర్మించే గోశాల డిజైన్లను మంత్రివర్గ భేటీలో ప్రదర్శించారు.

రాష్ట్రంలో 306 గోశాలలున్నాయి. కగా హైదరాబాద్‌లో ఎన్కేపల్లి, వెటర్నరీ యూనివర్సిటీ, వేములవాడ, యాదగిరిగుట్టలో అత్యాధునికంగా గోశాలలు నిర్మించాలని నిర్ణయించారు. వీటితో పాటు రాష్ట్రంలో ఉన్న గోశాలల రిజిస్ట్రేషన్లు, వాటి నిర్వహణపై సమగ్ర విధాన పత్రం రూపొందించాలని మంత్రివర్గం నిర్ణయించింది. మత్స్యకార సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. చెరువులు, కుంటల్లో 80-110 మి.మీ. సైజు గల 82 కోట్ల చేప పిల్లలను విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన బడ్జెట్‌ను రూ.19 కోట్ల నుంచి రూ.122 కోట్లకు పెంచాలని మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెంపునకు సంస్కరణలు

- వివిధ ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పనితీరును సమీక్షించేందుకు వీలుగా వారి ఆధార్, పూర్తి వివరాలు సేకరించాలని ఆర్థిక శాఖను మంత్రివర్గం ఆదేశించింది.
- ప్రభుత్వ ఉద్యోగుల హాజరుతో పాటు విధి నిర్వహణలో జవాబుదారీతనం పెంచేందుకు అవసరమైన సంస్కరణలు తీసుకురావాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇప్పటికే ఉద్యోగులకు సంబంధించి నియమించిన అధికారుల కమిటీకి ఈ బాధ్యత అప్పగించాలని నిర్ణయించారు. రెండు నెలల్లో పూర్తి స్థాయి నివేదికను సమర్పించాలని కమిటీని ఆదేశించింది.



## హ్యామ్ మోడల్‌లో రూ.22 వేల కోట్లతో 2,627 రహదారుల అభివృద్ధికి

# టెండర్ల ప్రక్రియా ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

మండల కేంద్రాలను జిల్లా కేంద్రాలకు అనుసంధానం చేయడంలో హ్యామ్ రోడ్లు కీలకం కానున్నాయని తెలిపారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో బుధవారం రోడ్లు భవనాలు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. 'టెండర్ల ప్రక్రియను అధికారులు వెంటనే ప్రారంభించాలి. ప్రాధాన్య క్రమంలో హ్యామ్ రోడ్లను నిర్మిస్తాం. వంతెనలను ముందే గుర్తించి రోడ్ల నిర్మాణ సమయంలో ప్రమాదాలు జరగకుండా చూడాలి. రాష్ట్రంలో 50 శాతం రోడ్లు హ్యామ్ పద్ధతిలో అభివృద్ధి చేస్తాం. ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం టెండర్ల ప్రారంభంతో పాటు దక్షిణభాగం ఆమోదం కోసం త్వరలోనే ప్రధాని మోదీ, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలుస్తాం. ఎన్‌హెచ్ 65 రహదారి పురోగతి పనుల్లో భాగంగా మదీనాగూడ నుంచి సంగారెడ్డి వరకు ఆరు వరుసల రహదారి పనులను వేగవంతం చేయాలి. చివరి దశల్లో ఉన్న టిమ్స్, కలెక్టరేట్లు, ఆర్వోబీ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి' అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ఎన్‌హెచ్ఏఐ ఆర్వో కృష్ణ ప్రసాద్, ఆర్అండ్‌బీ ఈఎన్సీ జయభారతి తదితరులు పాల్గొన్నారు.

**17 ప్యాకేజీలుగా హ్యామ్ రోడ్ల పనులు**

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో అభివృద్ధి చేయనున్న హ్యామ్(హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రహదారుల పనులను 17 ప్యాకేజీలుగా విభజించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ప్యాకేజీల వారీగా టెండర్ల ప్రక్రియ, నిధుల కేటాయింపులపై గురువారం జరిగే మంత్రిమండలి సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. గతంలో రూపొందించిన హ్యామ్ జాబితాను మార్చి సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు కొత్త జాబితాను రూపొందించినట్లు సమాచారం. అధిక ట్రాఫిక్ ఉన్న రహదారులను కొత్త జాబితాలో పొందుపరిచారు. ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య ఉన్న ఆర్అండ్‌బీ రహదారులకు ఈ జాబితాలో ప్రాధాన్యమిచ్చారు. ఫ్యూచర్ సిటీ, పారిశ్రామిక అభివృద్ధి దృష్ట్యా ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో ఎక్కువగా రహదారులను గుర్తించారు. జిల్లా కేంద్రాల నుంచి ప్రధాన పట్టణాలకు వెళ్లే రహదారులనూ కొత్త జాబితాలో చేర్చారు. దేవాలయాలు, పర్యాటక ప్రాంతాల రహదారులను మొదటి దశ హ్యామ్‌లో పొందుపరిచారు. హ్యామ్ పద్ధతిలో రోడ్లుభవనాల శాఖకు చెందిన 373, పంచాయతీరాజ్ శాఖకు చెందిన 2,254 రహదారులను మొదటి దశలో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం సుమారు రూ.22 వేల కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. టెండర్లు పొందిన గుత్తేదారుకు బ్యాంకు గ్యారంటీ, ప్రభుత్వ వాటా చెల్లింపులు, 15 ఏళ్లలో దశలవారీగా చెల్లించాల్సిన నిధులపైనా క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. క్యాబినెట్ నిర్ణయం ఆధారంగా త్వరలోనే హ్యామ్ రోడ్ల పనులకు టెండర్లు పిలవనున్నట్లు ఆర్అండ్‌బీ వర్గాలు వెల్లడించాయి.

# కల్తీ కల్లు ఘటనపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)




ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న బాధితులకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి విషాదకరమైన సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు. 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించారు. "ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ బుల్డోజర్" అంటూ ప్రస్తుత పాలనను అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను గాలికొదిలేసి, ప్రజలు అడగని బుల్డోజర్ పాలనను ముందుకు తెచ్చిందని ఆరోపించారు. పేదలకు రూ.4000 పెన్షన్, మహిళలకు మహాలక్ష్మి పథకం, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు వంటి కీలక హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. మహానగరం బుల్డోజర్ పాలనను ముందుకు తెచ్చిందని ఆరోపించారు. పేదలకు రూ.4000 పెన్షన్, మహిళలకు మహాలక్ష్మి పథకం, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు వంటి కీలక హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. మహానగరం నుంచి మారుమూల పల్లెల వరకు బుల్డోజర్ రాజ్యం నడుస్తోందని, తెలంగాణ ప్రజలు మేల్కోవాలని "జాగో తెలంగాణ జాగో" అంటూ పిలుపునిచ్చారు.

# ఇందిరమ్మ ఇళ్ల'లో ఎంపీలకు 40 శాతం కోటా ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పార్లమెంటు సభ్యులకు కూడా భాగస్వామ్యం కల్పించాలని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపికలో ఎంపీలకు 40 శాతం కోటా కేటాయించాలంటూ ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈరోజు ఓ లేఖ రాశారు. ఈ నిర్ణయం ద్వారా పేదలకు మరింత న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యేల మాదిరిగానే ఎంపీలు కూడా ప్రజల చేత నేరుగా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులని రఘునందన్ రావు తన లేఖలో పేర్కొన్నారు. అందువల్ల, ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో తమకు కూడా అవకాశం కల్పించాలని కోరారు. పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని మొత్తం 17 మంది ఎంపీలకు ఈ కోటాను వర్తింపజేయాలని ఆయన సూచించారు. దీనివల్ల లబ్ధిదారుల ఎంపికలో సహేతుకత, పారదర్శకత పెరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఎంపీగా పనిచేశారన్న విషయాన్ని రఘునందన్ రావు ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులను ఇందిరమ్మ ఇళ్ల పథకంతో అనుసంధానించడాన్ని ఆయన స్వాగతించారు. తన అభ్యర్థనపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, వెంటనే నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.



# చేనేత రుణమాఫీ నిధులు వెంటనే జమ చేయండి

చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ నిధులను తక్షణమే వారి ఖాతాల్లో జమ చేయాలని, వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈరోజు హైదరాబాద్‌లో చేనేత జౌళి శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖలకు అవసరమైన వస్త్రాల కోసం సెప్టెంబర్ నెలలోపే ఆర్డర్లు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే అందిన ఆర్డర్లకు సంబంధించిన వస్త్రాలను వేగంగా పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా, హైదరాబాద్‌లో ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని ఏడాదిలోగా యాదాద్రి జిల్లా పోచంపల్లికి శాశ్వతంగా తరలించాలని ఆదేశించారు. టెస్కో షోరూంల పనితీరును మెరుగుపరిచి, 'మహిళా శక్తి' చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలన్నారు. ఈ సమీక్షలో భాగంగా జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ, చేనేత కార్మికుల రుణమాఫీ కోసం ప్రభుత్వం రూ. 33 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5,691 మంది కార్మికులు లబ్ధి పొందనున్నారని, వెరిఫికేషన్ పూర్తి కాగానే నిధులు విడుదల చేస్తామని వివరించారు. 'నేతన్నకు చేయూత' పథకం కింద 194 మంది మృతుల కుటుంబాలకు రూ. 9.70 కోట్లు అందించినట్లు ఆమె పేర్కొన్నారు. అనంతరం, 2024 సంవత్సరానికి గాను జాతీయ చేనేత పురస్కారాలకు ఎంపికైన పుట్టపాక గ్రామానికి చెందిన గజం నర్మద, గూడ పవన్‌లను మంత్రి తుమ్మల శాలువాతో సత్కరించారు. తెలంగాణ చేనేతకు జాతీయ స్థాయిలో గుర్తింపు తేవడం గర్వకారణమని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన భరోసా ఇచ్చారు.

# యశోద ఆసుపత్రిలో చేరిన కేసీఆర్

- **వైద్యుల సూచన మేరకే ఆసుపత్రిలో అడ్మిట్**
- **కొనసాగుతున్న తదుపరి వైద్య పరీక్షలు**
- **ఇటీవలే చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన మాజీ ముఖ్యమంత్రి**
- **వారం రోజుల విశ్రాంతి అనంతరం మళ్లీ చేరిక**

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి ఆసుపత్రిలో చేరారు. వైద్యుల సూచన మేరకు గురువారం ఆయన హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. ప్రస్తుతం వైద్యులు ఆయనకు అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన కేసీఆర్, చికిత్స అనంతరం ఈ నెల 5న డిశ్చార్జ్ అయ్యారు. ఆ సమయంలో రక్తంలో షుగర్, సోడియం స్థాయిలను పర్యవేక్షించేందుకు ఆయనకు వైద్యులు చికిత్స అందించారు. డిశ్చార్జ్ సమయంలో వారం రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, ఆ తర్వాత తదుపరి పరీక్షల కోసం మళ్లీ రావాలని సూచించారు. వైద్యుల సలహా మేరకు వారం రోజుల విశ్రాంతి అనంతరం కేసీఆర్ మళ్లీ ఆసుపత్రికి వెళ్లారు.

# 42 శాతం రిజర్వేషన్ చట్టబద్ధత తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

◆ **ఎంపీటీసీ ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడిల కుమార్ గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

బిసి లకు 42 శాతం రిజర్వేషన్ చట్టబద్ధత కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఎంపీటీసీ ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడిల కుమార్ గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య, రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం ప్రెస్ క్లబ్ లో బిసిపిఎఫ్, బీసీ ప్రజా ప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు చెప్పిన కామారెడ్డి డిక్లరేషన్, స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం బీసీలకు రిజర్వేషన్ చట్టబద్ధత కల్పిస్తామని నమ్మపలికి బీసీ ల ఓట్ల ద్వారా గద్దెనెక్కి కాలయాపన చేస్తూ పార్టీ పరంగా ఏస్తమని చెప్పడం బీసీ లను మోసం చేయడమే అన్నారు. నేడు 10వ తేదీన హైదరాబాద్ లో జరిగే క్యాబినేట్ సమావేశంలో 42 శాతం రిజర్వేషన్ చట్టబద్ధత కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా బీసీ సామాజిక వర్గానికి మొత్తం జనాభా సర్వే నిర్వహించాలని, 33 శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళలకు అవకాశం ఇవ్వాలన్నారు. ఇచ్చిన మాట తప్పి.. ఎన్నికలను జీ.ఓ ల ద్వారా నిర్వహించాలని చూస్తే బిసి వర్గాల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ లలో కూడా 42శాతం బీసీలకు ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీలకు అతీతంగా రాష్టంలోని బిసి సామాజిక ప్రజా ప్రతినిధులతో పాటు ప్రజలను భాగస్వామ్యం చేసి ఈనెల 15 న ఇందిరా పార్క్ దగ్గర 10 వేల బీసీ బిడ్డలతో బిసి ల మహా ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహా ధర్నాకు బిసి ల నుండి అన్ని సంఘాలు, ప్రజలు, వార్డ్ మెంబర్ నుండి ఎమ్మెల్యే, ఎంపీ ల వరకు రాజకయపార్టీల కతీతంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా తో పాటు, రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుండి పెద్దయెత్తున పాల్గొని మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే మరో సకల జనుల సమ్మె తరహాలో మరో ఉద్యమం చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం హైదరాబాద్ లో ఈ నెల 15న ఇందిరా పార్కు వద్ద జరిగే బీసీల మహా ధర్నా వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గడీల కుమార్ గౌడ్, ప్రణీల్ చందర్, సుర్వి యాదయ్య గౌడ్, దేవి రవీందర్, సుప్ప ప్రకాష్, వల్లూరి వీరేష్, నవీన్, సాగర్, రాజేష్, మేకల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.







## సిటీ స్పెషల్ బ్రాంచ్ ఏసిపి గా భాధ్యతలు స్వీకరించిన టి. మహేష్

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం సిటీ స్పెషల్ బ్రాంచ్ ఏసిపి గా టి. మహేష్ గురువారం భాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయం లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.



## దరిపల్లి అనంత రాములు ఇంజనీరింగ్ కళాశాలలో గురుపౌర్ణమి ఉత్సవం

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

గురుపౌర్ణిమను పురస్కరించుకొని దరిపల్లి అనంత రాములు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దరిపల్లి విద్యాసంస్థల అధినేత మరియు ప్రిన్సిపల్ డాక్టర్ దరిపల్లి కిరణ్ ని విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులకు గురువుల ప్రాముఖ్యతను వివరించారు. గురువు ఒక దిశా నిర్దేశకుడు మాత్రమే కాకుండా, విద్యార్థి జీవితాన్ని మారుస్తున్న మార్గదర్శకుడని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దరిపల్లి విద్యాసంస్థల అధినేత మరియు ప్రిన్సిపల్ డాక్టర్ దరిపల్లి కిరణ్ మాట్లాడుతూ, "గురువు అంటే కేవలం విద్య బోధించేవాడు కాదు. జీవితం లో విలువలు, క్రమశిక్షణ, నైతికతలను బోధించే ప్రేరణాత్మక శక్తి కూడా. విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవడంలో గురువు పాత్ర అత్యంత కీలకం," అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, మరియు ఇతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.





## టిఎంఆర్ టీం సభ్యుని పరమర్శించిన మండల కాంగ్రెస్ నాయకులు

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి టిఎంఆర్ టీం సభ్యుడు మనిగిల్ల శివ యాదవ్ ను గురువారం పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు.బుధవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేపట్టిన మార్నింగ్ వాక్ లో జరిగిన ఊహించని సంఘటనలో కుడికాలు పాదానికి తీవ్ర గాయం అయింది.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వెంటనే స్పందించిన టిఎంఆర్ టీం సభ్యులు, పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్ తగిన చికిత్స చేయించారు.ఈ క్రమంలో పెద్దమందడి మండలం మనీగిళ్ల గ్రామంలో తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న శివ యాదవ్ ను వారు పరామర్శించి సంఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యాడ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి ,మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, మాజీ సర్పంచులు రమేష్, రాధాకృష్ణ , చింతకాయల వెంకటేష్ , మండల నాయకులు గట్టు యాదవ్ , మధిర శ్రీశైలం వెల్టూర్ వివేక్ , టైలర్ రవి ,రాఘవేందర్ , అల్వాల సుదర్శన్ రెడ్డి,రాము, అమ్మపల్లి బాలు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా చిన్నారి అన్విత జన్మదిన వేడుకలు

**-హాజరైన వివిధ పార్టీల రాష్ట్ర నాయకులు**

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**

మండలంలోని పెద్దపెండ్యాల ఆర్కే గార్డెన్స్‌లో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జి గుర్రపు ప్రవీణ్ - రీనా దంపతుల కుమార్తె అన్విత తొలి జన్మదిన వేడుకలు గురువారం సాయంత్రం వైభవంగా నిర్వహించబడ్డాయి. వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య చిన్నారితో కేక్ కట్ చేయించి, ఆశీర్వచనాలు అందించారు. చిన్నారి అన్విత ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగాలని, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర నాయకురాలు పావని గౌడ్, కాంగ్రెస్ నేత సింగపురం ఇమ్మాన్యుయేల్ రాజు పాల్గొన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.







## చిన్నారికి ఆశీర్వదించిన ఇమ్మానియేల్ రాజ్

**ధర్మసాగర్, తెలంగాణ ముచ్చట్లు**

జనగామ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్దపండ్యాల ఆర్కే గార్డెన్లో గుర్రపు ప్రవీణ్ రీనా కుమార్తె చిన్నారి అన్విత మొదటి జన్మదిన వేడుకలో పాల్గొన్న స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సింగపురం ఇందిరా కుమారుడు యువ నాయకులు సింగపురం ఇమ్మానియేల్ రాజ్, అనంతరం ఆ చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన ప్రధాన కార్యదర్శి వడ్లూరి మౌనిక,జిలా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు సింగపురం నాగయ్య, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ జీడీ కోర్నెల్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నారగోని పద్మ, మండల మహిళా అధ్యక్షురాలు చింత జ్యోష్న, ఎంపీటీసీల మండల మాజీ అధ్యక్షులు సింగపురం దయాకర్, తిరుమలనాధ స్వామి దేవస్థం మాజీ వైస్ చైర్మన్ రెడ్ల సమ్మయ్య, ధర్మసాగర్ మండల కోఆర్డినేటర్ బిక్షపతి, చిల్పూర్ బిసి సెల్ అధ్యక్షులు బాలరాజు, చిల్పూరు మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ మనీ, సీనియర్ నాయకులు తాటికొండ సంపత్, దివాకర్, యువ నాయకులు ప్రతిష్, అవినాష్, సరిత తదితరులు పాల్గొన్నారు.



## విశ్వనాథం కుటుంబాన్ని ఆర్థిక సహాయాన్ని అందజేసిన శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఇలాసాగరపు విశ్వనాథం కుటుంబాన్ని పరమర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేసిన శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ ఖమ్మం జిల్లా కమిటీసభ్యులు
కొణిజర్ల మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఇలాసాగరపు విశ్వనాథం అనారోగ్యం చేత ఇటీవల మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు వారి ఇంటికి వెళ్లి విశ్వనాథం సతీమణిని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేయడమైనది. ఈ కార్యక్రమంలో శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు తిగుళ్ల వెంకటరమణ ప్రధాన కార్యదర్శి మొగిలిచర్ల వెంకటేష్ కోశాధికారి కొలిచలం చిరంజీవి గౌరవ సలహాదారు డేర్ విద్యా సంస్థల చైర్మన్ కిరణ్ గౌరవ సలహాదారు కోళ్లురి పరుశురాములు సయుక్త కార్యదర్శి గుమ్మడెల్లి సైదారవు శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ కొణిజర్ల మండల ఇంచార్జ్ ఇలాసాగరపు ప్రసాద్ జిల్లా యువత అధ్యక్షులు రాచర్ల రాజు యూత్ సభ్యులు పోరళ్ల కృష్ణ స్థానిక కుల బంధువులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో కొత్త కురువ మల్లమ్మ చంద్రయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఇట్టి విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ... వారికి 5000 రూపాయల ఆర్థిక సాయం పార్టీ నాయకుల ద్వారా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్దయ్య, మధిర శ్రీశైలం, వెంకటయ్య, కృష్ణయ్య, హనుమంతు ,పెద్ద మల్లయ్య, తదితరులు పాల్గొనడం జరిగింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# సమాజంలో గురువు పాత్ర అత్యంత విశిష్టమైంది

- మార్గమే గురువు...గురువే మార్గం
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

గురుపౌర్ణమి సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తన పాఠశాల గురువు నాగులపల్లి.సీతారామారావు ను కలిశారు . గురువారం హైదరాబాద్ లోని వారి స్వగృహంలో కలసి గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసి పాదనమస్కారం చేసి గురుఅశీర్వాదం తీసుకున్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు జన్మనిస్తే, గురువులు విద్యాబుద్ధులు,సంస్కారాన్ని,ఉన్నతవిలువలతో కూడిన జీవిత పాఠాలు నేర్పించి సమాజానికి మార్గదర్శకంగా నిలిపేది గురువులు అని కొనియాడారు.

# హైదరాబాద్‌లో వైన్ షాపులు బంద్

**(మొదటి పేజీ తరువాయి)**

సెంట్రల్ జోన్ పరిధిలో గాంధీ నగర్ డివిజన్.. అలాగే ఈస్ట్ జోన్ పరిధిలో చిలకలగూడ డివిజన్‌లోని చిలకలగూడ, లాలాగూడ, వారాసిగూడ.. అదే విధంగా నార్త్ జోన్ పరిధిలో బేగంపేట డివిజన్, గోపాలపురం డివిజన్ పరిధిలో గోపాలపురం, తుకారాం గేట్, మారేడుపల్లితోపాటు మహంకాళి డివిజన్ అంటే.. మహంకాళి, రామ్‌గోపాల్‌పేట, మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్యం షాపులన్నీ మూసి ఉంటాయని ఆ ఉత్తర్వుల్లో వివరించారు. ఆషాఢ మాసం ప్రారంభమైంది. తెలంగాణలో బోనాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. బోనాలు నేపథ్యంలో ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. నగరంలోని ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

# కమిటీల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలి

- మండల స్థాయి, గ్రామస్థాయి, బూతు స్థాయి కమిటీలను వెంటనే ఏర్పాటు చేసుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి జిల్లావ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ మండలంలోనూ త్వరితగతిన మండల స్థాయి గ్రామస్థాయి బూతు స్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి పేర్కొన్నారు.గురువారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన జిల్లా మహిళా ప్రత్యేక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు.నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారత కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని వాటిని గ్రామాలలో



పూర్తిస్థాయిలో అమలయ్యేందుకు మహిళలు కృషి చేయాలని ఆమె సూచించారు.స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కోసం అనేక అవకాశాలు ఉన్నాయని వినియోగించుకోవాలని ఆమె అన్నారు. గ్రామాలలో ముందుకెళ్లాలంటే ముందుగా కమిటీలు పూర్తి చేసుకోవాలని కమిటీల ఏర్పాటు పై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలని సూచించారు.రానున్న లోకల్ బాడీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మహిళా సంఘాలకు ప్రధాన పాత్ర ఉంటుందని ప్రతి ఒక్కరూ చురుగ్గా పాల్గొనాలని ఆమె కోరారు.కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే ప్రతి మహిళకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మూడవ అనిత, చిన్నంబావి అధ్యక్షురాలు అనూష, ఆత్మకూర్ అధ్యక్షురాలు విజయ, వనపర్తి మాజీ కౌన్సిలర్లు, రమాదేవి పద్మ, విజయ లక్ష్మి, జయసుధ, సత్యమ్మ , మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతంపై పావని గౌడ్,అరూరి రవిచందర్ సమావేశం

**చిల్పూర్,తెలంగాణ ముచ్చట్లు:**

బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా విభాగంలో మహిళా నాయకురాలిగా సేవలందిస్తున్న పావని గౌడ్‌ను అరూరి రవిచందర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, డిజిటల్ వేదికలపై పార్టీ ప్రచారం, మహిళా నాయకుల పాత్ర తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది.

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో సోషల్ మీడియా కీలకమైన పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, పార్టీ సిద్ధాంతాలు, ప్రజల సమస్యలపై స్పందన, పార్టీ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం కోసం సమగ్ర వ్యూహాలు రూపొందించాల్సిన అవసరంపై చర్చ జరిగింది. ముఖ్యంగా యువత, మహిళలలో పార్టీపట్ల ఆసక్తి పెంచేలా సోషల్ మీడియా వినియోగాన్ని పెంచాల్సిన దిశగా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

సామాజిక మాధ్యమాల ద్వారా పార్టీ గొంతును ప్రజలలోకి చొప్పించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా రవిచందర్ వివరించారు. అంతేగాకుండా, గ్రామస్థాయిలో పార్టీకి మద్దతు పెంచేలా ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాల్సిన అవసరం ఉందని, భవిష్యత్ కార్యాచరణ కూడా ఆ దిశగా ఉండాలన్నారు.

మహిళా నాయకుల పాత్రను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, పార్టీలో వారి పాత్రను సమర్థంగా వినియోగించుకోవాలని చర్చించారన్నారు. పార్టీ నూతన ధోరణులలో, సమకాలీన రాజకీయాల్లో మహిళా నేతల పాత్ర ప్రాధాన్యత కలిగినదని అభిప్రాయపడ్డారు.సమావేశం పూర్తిగా సానుకూలంగా ముగిసిందని, అందులో వచ్చిన సూచనలు, చర్చలు భవిష్యత్తులో పార్టీ కార్యాచరణకు మార్గదర్శకంగా నిలవవచ్చని నేతలు పేర్కొన్నారు.



# పవన్ కల్యాణ్, బాలకృష్ణ బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ చేశారు

**(మొదటి పేజీ తరువాయి)**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణలను లక్ష్యంగా చేసుకుని ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పవన్, బాలకృష్ణ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేశారని ఆరోపించిన ఆయన, వారిపై తక్షణమే విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేఏ పాల్ మాట్లాడుతూ, ‘‘పవన్ కల్యాణ్, ఆయన సోదరులు, బాలకృష్ణ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయలేదా?’’ అని సూటిగా ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో పొత్తులో ఉన్నందునే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. బీజేపీతో పొత్తు పెట్టుకుంటే వారిపై విచారణలు ఉండవా? వాళ్ల మీద ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు జరగవా?’’ అంటూ ఆయన నిలదీశారు. బీజేపీతో కలిస్తే పద్మభూషణ్‌లు ఇచ్చి చాలా శుభ్రంగా కాపాడతారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో దౌర్జన్యం, అవినీతి పెరిగిపోయి ఆకాశాన్ని అంటుతున్నాయని కేఏ పాల్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.





# ఘనంగా గుర్రపు ప్రవీణ్, రాజారపు సుమన్ జన్మదిన వేడుకలు

**స్టేషన్ ఘనపూర్, తెలంగాణ ముచ్చట్లు:**

బీఆర్ఎస్ పార్టీ స్టేషన్ ఘనపూర్ సోషల్ మీడియా విభాగంలో చురుకైన పాత్ర పోషిస్తున్న గుర్రపు ప్రవీణ్, ధర్మసాగర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు సుమన్‌ల జన్మదిన వేడుకలు గురువారం ధర్మసాగర్ మండలంలోని కరుణాపురంలో ఘనంగా జరిగాయి.

ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు వారిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకలో పాల్గొన్న ప్రతి ఒక్కరు ప్రవీణ్, సుమన్ ఆరోగ్యంగా, సుఖంగా, ప్రజాప్రయోజనాల్లో ఇంకా శ్రద్ధతో కొనసాగాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో పలువురు ప్రముఖ రాజకీయ నేతలు ఉన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ డిప్యూటీ సిఎం డాక్టర్ తాటికొండ రాజయ్య,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పావని గౌడ్,కాంగ్రెస్ పార్టీ యువనాయకులు సింగపురం ఇమ్మానుయేల్ రాజ్,తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక సంపాదకులు బొల్లెపాక రాజేష్,బిఆర్ఎస్ పార్టీ ధర్మసాగర్ మండల అధ్యక్షులు మునిగలా రాజు,సీనియర్ నాయకులు వారాల రమేష్,నాయకులు చిరంజీవి,రవిచందర్, కుర్సపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మల్నాడు కిచెన్ డ్రగ్స్ కేసులో విస్తుపోయే నిజాలు

**(మొదటి పేజీ తరువాయి)**

మల్నాడు కిచెన్ యజమాని సూర్య అంతర్జాతీయ డ్రగ్స్ రాకెట్ నడుపుతున్నట్లు ఈగల్ టీమ్ గుర్తించారు. మల్నాడు కిచెన్ నుంచి డ్రగ్స్‌ను ఆర్డర్ల వారీగా సప్లై చేసినట్లు ఆధారాలు సేకరించింది టీమ్. రెస్టారెంట్‌తో పాటు హైదరాబాద్‌లో 20 పబ్బులకు ఇప్పటి వరకు డ్రగ్స్ సప్లై అయినట్లు ఈగల్ టీం విచారణలో వెల్లడైంది. అలాగే ప్రముఖులకు కూడా డ్రగ్స్‌ను డోర్ డెలివరీ చేసినట్లు గుర్తించారు. గోవాలో నైజీరియన్ దేశస్థుడు నిక్ నుంచి కొకైన్, ఎమ్‌డీఎమ్ఏను కొనుగోలు చేశారని.. డ్రగ్స్ కోసం హాస్పిటల్ ట్రీట్మెంట్ పేరుతో 1.8 లక్షలు నగదు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు గుర్తించారు. శ్రీ మారుతి కొరియర్ పేరుతో డ్రగ్స్ ప్యాకెట్లు సరఫరా అయినట్లు తెలుస్తోంది. గర్ల్స్ చెప్పుల హీల్ నుంచి కొకైన్, ఎక్స్‌టసీ పిల్స్, ఓజీ కుష్ ఆయిల్‌ను ఈగల్ టీమ్ స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్‌లో 15 మంది డాక్టర్లకు కొరియర్ల ద్వారా డ్రగ్స్‌ను సూర్య అందజేసినట్లు ఈగల్



టీమ్ విచారణలో తేలింది. మల్నాడు రెస్టారెంట్ యజమాని సూర్యతో ముగ్గురు పబ్ యజమాలతో సంబంధాలు ఉన్నట్లు విచారణలో బయటపడిరది. మూడు పబ్‌ల యజమాలతో కలిసి డ్రగ్ పార్టీలు నిర్వహించినట్లుగా ఈగల్ టీమ్ గుర్తించింది. ఈ క్రమంలో పబ్ యజమానులకు ఈగల్ టీమ్ నోటీసులు ఇవ్వాలని నిర్ణయించింది. వచ్చే వారం తమ ఎదుట హాజరుకావాలని పబ్బు యజమానులకు నోటీసులు ఇవ్వనుంది.

పబ్బుల్లో డ్రగ్స్ పార్టీ కోసం యాజమాన్యాలు ప్రత్యేక ఏర్పాటు చేశాయి. ఫామ్ పబ్, బర్డ్ బాక్స్ పబ్ , బ్లాక్ 22 పబ్, వాక్ కోరా పబ్, బ్రాడ్ వే పబ్ పార్టీలు జరిగినట్లు ఈగల్ టీమ్ గుర్తించింది. ఈ క్రమంలో వాక్ కోరా పబ్, బ్రాడ్ వే పబ్, బ్రాడ్ వే పబ్ యజమానులపైన పోలీసులు కేసు నమోదు చేశారు. క్వాక్ పబ్ ఓనర్ రాజాశేఖర, కోరా పబ్ యజమాని పృథ్వీ వీరమాచినేని, బ్రాడ్ వే పబ్ ఓనర్ రోహిత్ మాదిశెట్టిపై కేసు నమోదు అయ్యింది. ఈ ముగ్గురు పబ్బు యజమానులతో కలిసి డ్రగ్ పార్టీలు నిర్వహించినట్లు విచారణలో సూర్య పేర్కొన్నారు. దీంతో వీరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# 50 శాతం సుంకాలతో బ్రెజిల్‌పై అమెరికా రివెంజ్..

రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా. ట్రంప్ రాజా తలచుకుంటే సుంకాలకు కరువా. టారిఫ్‌ల కొరడాతో ఛెళ్లుఛెళ్లుమని బాదేస్తున్న అమెరికా అధ్యక్షుడు.. బ్రెజిల్‌కి బంపరాఫర్ ఇచ్చారు. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ఆతిథ్యమిచ్చిన ఆ దేశంపై 50 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా. ట్రంప్ రాజా తలచుకుంటే సుంకాలకు కరువా. టారిఫ్‌ల కొరడాతో ఛెళ్లుఛెళ్లుమని బాదేస్తున్న అమెరికా అధ్యక్షుడు.. బ్రెజిల్‌కి బంపరాఫర్ ఇచ్చారు. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ఆతిథ్యమిచ్చిన ఆ దేశంపై 50 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. మీటింగ్ పెట్టినందుకు, తనను తిట్టినందుకు పన్నులేశారంటే బాగోదుగా.. అందుకే మరో సాకు వెతుక్కున్నారు ట్రంప్. నవ్విపోదురుగాక అన్నట్లే ఉంది ట్రంప్ వ్యవహారం. బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారోని వేధిస్తున్నారనే ఆరోపణలతో ఆ దేశంపై 50 శాతం సుంకం విధించారు. ఈమధ్యే అమెరికా విధానాలను వ్యతిరేకించే బ్రిక్స్ అనుకూల దేశాలపై అదనంగా 10 శాతం అదనపు సుంకం విధిస్తానని ట్రంప్



హెచ్చరించారు. దీనికి బ్రెజిల్ ప్రెసిడెంట్ సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు. ఈ ప్రపంచానికి చక్రవర్తి అవసరం లేదంటూ బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా గట్టి కౌంటర్ ఇచ్చారు. దీంతో ట్రంప్ ఇగో హర్ట్ అయింది. బ్రెజిల్‌పై విధించిన 50 శాతం సుంకాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించారు అమెరికా అధ్యక్షుడు. స్వేచ్ఛా ఎన్నికలపై బ్రెజిల్ దాడులు చేస్తోందని ఆరోపించిన ట్రంప్.. దీనికి ప్రతీకారం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. బోల్సోనారోపై జరుగుతున్న విచారణని నిలిపివేయాలని డిమాండ్‌చేశారు. బ్రెజిల్ వాణిజ్య విధానాలపై ఎంక్వయిరీ చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. అయితే కెనడా తర్వాత అమెరికాకు అతిపెద్ద ఉక్కు ఎగుమతిదారుగా ఉన్న బ్రెజిల్.. ట్రంప్ చర్యలను చట్టపరంగానే ఎదుర్కొంటామంటోంది. మరోవైపు.. బ్రెజిల్‌లోని యూఎస్ రాయబార కార్యాలయం బోల్సోనారోకు మద్దతు ప్రకటించింది. బోల్సోనారో, ఆయన కుటుంబసభ్యులు అమెరికాకు బలమైన భాగస్వాములని ఓ ప్రకటన విడుదల చేసింది. వారిపై, ఆయన అనుచరులపై జరుగుతున్న రాజకీయ హింస సిగ్గు చేటని, ప్రజాస్వామ్య సంప్రదాయాలను అగౌరవపరచడమేనని విమర్శించింది. దీన్ని బ్రెజిల్ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ ప్రకటనపై విచారణకు రావాలని యూఎస్ రాయబారిని ఆదేశించింది. 2020లో బ్రెజిల్‌లో జరిగిన ఎన్నికల్లో బోల్సోనారో ఓడిపోయారు. ఆ సమయంలో దేశంలో జరిగిన హింసాత్మక ఘటనల్లో ఆయన పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మాజీ అధ్యక్షుడితో పాటు మరో 33 మందిపై అభియోగాలు నమోదయ్యాయి. అక్కడి సుప్రీంకోర్టు ప్యానెల్‌లో జరుగుతున్న విచారణలో కుట్ర నిజమని తేలితే శిక్ష పడుతుంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో ఢిల్లీకి సిట్ అధికారులు

**(మొదటి పేజీ తరువాయి)**

సుప్రీంకోర్టులో ప్రభాకర్ రావుకు ఉన్న రిలీఫ్ రద్దు చేయాలంటూ పిటిషన్ దాఖలు చేయాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే డీసీపీ విజయ్ కుమార్, ఏసీపీ వెంకటగిరి ఢిల్లీకి వెళ్లారు. ఈరోజు (గురువారం) సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు సిట్ అధికారులు. పిటిషన్‌లో ప్రభాకర్ రావు మినహాయింపులు రద్దు చేయాలని కోరనున్నారు. ప్రభాకర్ రావును కస్టోడియల్ విచారణ చేస్తే కీలకమైన విషయాలు వెలుగు చూస్తాయని సిట్ అధికారులు భావిస్తున్నారు. మరోవైపు ప్రభాకర్ రావును ఆగస్టు ఐదు వరకు అరెస్టు చేయవద్దంటూ సుప్రీంకోర్టు ఇదివరకే ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు ఢిల్లీకి వెళ్లి సుప్రీంకోర్టులో పిటిషన్ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఇప్పటివరకూ సిట్ అధికారులను



ప్రభాకర్ రావు తప్పుదోవ పట్టించే విధంగానే సమాధానాలు చెబుతూ వచ్చారు. తనకేమీ సంబంధం లేదని, తన పైస్థాయి అధికారులు ఇచ్చిన ఆదేశాలనే అమలు చేశానని, వ్యక్తిగతంగా ఫోన్ ట్యాపింగ్ చేయమంటూ ఎవరికీ ఉత్తర్వులు ఇవ్వలేదంటూ చెప్పుకొచ్చారు. కానీ ఈ కేసులో అరెస్ట్ అయిన ఐదుగురు నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం.. ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే తాము ఇదంతా చేశామని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో ఆగస్టు 5 వరకు ప్రభాకర్ రావును అరెస్ట్ చేయొద్దంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో.. సిట్ అధికారులకు ఆయన డిఫెన్సివ్ మోడ్‌లోనే సమాధానాలు చెబుతూ వస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సుప్రీం ఇచ్చిన మినహాయింపులను రద్దు చేస్తే ఎస్ఐబీ మాజీ చీఫ్‌ను కస్టోడియల్ విచారణకు తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ మేరకు ప్రభాకర్ రావుకు ఇచ్చిన మినహాయింపులు రద్దు చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేయాలని సిట్ అధికారులు నిర్ణయించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



## మాందానీ గెలిస్తే న్యూయార్క్‌ను

# మేమే పాలిస్తాం

ఈ ఏడాది నవంబరులో న్యూయార్క్ మేయర్ పదవికి జరిగే ఎన్నికలలో డెమొక్రటిక్‌సోషలిస్ట్ అభ్యర్థి జోహ్రాన్ మాందానీ విజయం సాధిస్తే ఆ నగర పాలనను ఫెడరల్ ప్రభుత్వం తన చేతిలోకి తీసుకుంటుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నాటకీయ హెచ్చరికలు జారీ చేశారు. న్యూయార్క్ సిటీలో, వాషింగ్టన్ డీసీలో స్థానిక నాయకత్వాలు తన ప్రభుత్వ అజెండాకు కట్టుబడి ఉండని పక్షంలో వాటిని ఫెడరల్ ప్రభుత్వం తన నియంత్రణలోకి తీసుకుంటుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఈ రెండు నగరాలూ డెమొక్రాట్ల అధీనంలో ఉన్నాయి. శ్వేతసౌధంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ట్రంప్ ప్రసంగిస్తూ న్యూయార్క్ మేయర్‌గా మాందానీ గెలిస్తే ఆ నగరాన్ని అధ్యక్ష భవనం తన నియంత్రణలోకి తీసుకుంటుందని స్పష్టం చేశారు. వాషింగ్టన్ డీసీ పాలనా వ్యవహారాలలో జోక్యం చేసుకునేందుకు కూడా చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. అక్కడ నేరాలు పెరిగిపోయాయని, అక్రమాలు చోటుచేసుకుంటున్నా యని ఆరోపించారు. 'న్యూయార్క్ నగరాన్ని పాలించేందుకు ఓ కమ్యూనిస్టు ఎన్నికైతే అది ఎన్నటికీ ఒకేలా ఉండబోదు' అని మాందానీని ఉద్దేశిస్తూ ట్రంప్ చెప్పారు. అవసరమైనప్పుడు ఆయా ప్రదేశాలను పరిపాలించడానికి శ్వేతసౌధంలో తమకు కావాల్సినంత బలముందని వ్యాఖ్యానించారు. 'న్యూయార్క్ కోసం మేము ఏదైనా చేస్తాం. ఇంతకంటే ఏమీ చెప్పలేను. కానీ న్యూయార్క్‌ను మరోసారి గొప్ప నగరంగా మారుస్తాం. అలాగే దేశాన్ని కూడా' అని చెప్పుకొచ్చారు. న్యూయార్క్ నగరం సక్రమంగా నడుస్తుందని, దానికి మళ్లీ పూర్వ వైభవం తీసుకొస్తామని అంటూ తాను న్యూయార్క్‌ను ప్రేమిస్తున్నానని తెలిపారు. 'మేము న్యూయార్క్‌ను సరిదిద్దబోతున్నాం. జరగబోయేది అదే. బహుశా మనం వాషింగ్టన్ నుంచే ఆ పని మొదలు పెట్టాలి' అని అన్నారు. న్యూయార్క్ మేయర్ పదవికి జరగబోతున్న ఎన్నికలలో ప్రత్యర్థులైన ప్రస్తుత మేయర్ ఎరిక్ ఆడమ్స్, మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమో కంటే మాందానీ ముందంజలో ఉన్నారు. దీంతో మాందానీపై ట్రంప్ పదే పదే దాడి చేస్తున్నారు. ఆయన 'ఒక విపత్తు' అంటూ ఆరోపించారు. ఆయన డెమొక్రాట్ల నామినేషన్ పొందారని, వారు ఏ వైపు వెళుతున్నారో ఇది సూచిస్తోందని విమర్శించారు.







# ఆగని ఇజ్రాయిల్ దాడులు

వంద మందికి పైగా పాలస్తీనియన్ల మృతి

పాలస్తీనాలోని గాజాపై ఇజ్రాయిల్ భీకర దాడులు చేస్తోంది. ఆహారం కోసం సహాయ శిబిరాల వద్ద బారులు తీరిన ప్రజలపై సైతం అమానుషంగా విరుచుకుపడుతోంది. గత 24 గంటల కాలంలో ఇజ్రాయిల్ జరిపిన దాడులలో 105 మంది పాలస్తీనియన్లు మరణించారని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇదిలావుండగా కాల్పుల విరమణపై చర్చించేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూతో రెండోసారి సమావేశమయ్యారు. అయితే ఈ చర్చలలో పురోగతి కన్పించలేదని సమాచారం. దక్షిణ లెబనాన్‌లోని హెజ్బులా మౌలిక సదుపాయాల స్థావరాలపై దాడి చేసి ధ్వంసం చేశానని ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. జబాల్ బ్లాట్‌లో ఆయుధ డిపోలు ఉన్న ఓ ప్రాంగణాన్ని తమ దళాలు నాశనం చేశాయని చెప్పింది. లాబోహన్స్ ప్రాంతంలో హెజ్బులా ఆయుధ స్థావరాన్ని గుర్తించామని కూడా పేర్కొంది. అయితే దీనిపై హెజ్బులా నుండి ఎలాంటి స్పందన రాలేదు. కాగా అమెరికా, ఇజ్రాయిల్ మద్దతుతో నడుస్తున్న వివాదాస్పద సహాయ కేంద్రాల వద్ద జరిగిన దాడులలో ఇప్పటి వరకూ మరణించిన వారి సంఖ్య 770కి చేరింది. సెంట్రల్ గాజాలో ఆహార పంపిణీ కేంద్రాన్ని మూసివేయడంతో వేలాది మంది పాలస్తీనీయులు దక్షిణ ప్రాంతం వైపు తరలిపోతున్నారు. ఉత్తర గాజాలోని ఆస్పత్రులను విద్యుత్ కొరత వేధిస్తోంది. ఫలితంగా వందలాది మంది చనిపోయే ప్రమాదం ఉన్నదని ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. రఫా నగరంలోని ఓ సహాయ కేంద్రంపై ఇజ్రాయిల్ దళాలు జరిపిన కాల్పులలో చనిపోయిన వారి సంఖ్య ఎనిమిదికి



చేరింది. అమెరికా, ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆహార పంపిణీ కేంద్రాల వద్ద గందరగోళం నెలకొంటోంది. ఆహార పదార్థాలను ఎప్పుడు పంపిణీ చేస్తారో ఎవరూ చెప్పడం లేదు. దీంతో ప్రజలు తెల్లవారుజాము నుండే అక్కడ పెద్ద ఎత్తున గుమిగూడుతున్నారు. సాయం కోసం ఎదురు చూస్తున్న అన్నార్తులపై కూడా ఇజ్రాయిల్ దాడులు సాగిస్తోంది. ఇదిలావుండగా ఇంధన కొరతతో విలవిలలాడుతున్న గాజా ఆస్పత్రులకు వెంటనే సరఫరాలు ప్రారంభించాలని, లేని పక్షంలో వాటిని మూసివేయక తప్పదని ఐరాస మానవ హక్కుల కార్యాలయం ప్రతినిధి ఆందోళన వ్యక్తం చేశారు.

# బ్రిక్స్‌లో ఉంటే భారత్ పైనా అదనపు సుంకం

బ్రిక్స్‌లో కొనసాగిన పక్షంలో భారత్ పైన కూడా పది శాతం అదనపు సుంకం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. బ్రిక్స్‌ను స్థాపించిన ఐదు దేశాలలో భారత్ కూడా ఒకటి. ఇటీవల జరిగిన బ్రిక్స్ సదస్సు అమెరికాపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అమెరికా ఏకపక్షంగా సుంకాలు విధిస్తోందని, సుంకేతర చర్యలు చేపడుతోందని ఆరోపించింది. ఈ నేపథ్యంలో ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ 'బ్రిక్స్‌లో ఉంటే భారత్‌పై 10 శాతం అదనపు సుంకాన్ని విధిస్తాం. ఎందుకంటే మమ్మల్ని దెబ్బతీయడానికే బ్రిక్స్ ఏర్పడిరది. మా డాలరు విలువను తగ్గించేందుకు ప్రయత్నిస్తోంది. దానిని ప్రామాణికంగా తీసుకోకూడదని అంటోంది. వారు అలా చేయదలచుకుంటే ఓకే. నాకూ ఆట ఆడడం వచ్చు. బ్రిక్స్‌లో ఎవరు ఉన్నప్పటికీ అదనంగా పది శాతం సుంకం చెల్లించాల్సి ఉంటుంది. భారత్ విషయంలోనూ అంతే. ఎలాంటి మినహాయింపులు ఉండవు' అని స్పష్టం చేశారు. భారత్ గురించి, బ్రిక్స్ విడుదల చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రశ్నించగా డాలరును సవాలు చేయాలని అనుకునే దేశాలు భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని బెదిరించారు. అయితే అందుకు వారు సిద్ధపడతారని తాను అనుకోవడం లేదని చెప్పారు. 'నేను సంవత్సరం క్రితమే చెప్పాను. బ్రిక్స్ ముక్కలైపోయింది. అయితే ఇంకా కొందరు దానిని పట్టుకొని వేలాడుతున్నారు. నా ఉద్దేశంలో బ్రిక్స్ వల్ల పెద్ద ముప్పేమీ ఉండదు. అయితే వారు డాలరును నాశనం చేయాలని, తద్వారా దానిని ఏ దేశమూ ప్రామాణిక ంగా తీసుకోకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారు' అని ట్రంప్ మండిపడ్డారు. కాగా వాణిజ్య ఒప్పందంపై భారత్, అమెరికా మధ్య జరుగుతున్న చర్చలు తుది దశకు చేరుకుంటున్న తరుణంలో ట్రంప్ ఈ బాంబు పేల్చారు.

# బ్రెజిల్‌తో భారత్ మూడు కీలక ఒప్పందాలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా మోదీ దక్షిణ అమెరికా దేశమైన బ్రెజిల్‌ను సందర్శించారు. మోదీ ఈ సందర్శన సందర్భంగా బ్రెజిల్ భారత్ మధ్య అంతర్జాతీయ పర్యటనలు, అంతర్జాతీయ సహకారంతో సంబంధం ఉన్న నేర రంగానికి సంబంధించిన అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. అంతేకాకుండా ఇతర అనేక రంగాలలో కూడా బ్రెజిల్ భారత్ ఒప్పందాలపై సంతకాలు చేశాయి. విదేశాంగ మంత్రిత్వ శాఖ రెండు దేశాల మధ్య సంతకం చేయబడిన ఒప్పందాల వివరాలను వెల్లడిరచింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి పి. కుమారన్ తెలిపిన వివరాల ప్రకారం.. మోదీ బ్రెజిల్ అధికారిక సందర్శన సందర్భంగా రెండు దేశాల మధ్య పునరుత్పాదక ఇంధనం (రిన్యూవబుల్ ఎనర్జీ), డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ రంగాలలో ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందం ప్రకారం.. రెండు దేశాలు ఈ రంగాలలో పెద్ద ఎత్తున డిజిటల్ సొల్యూషన్‌లను ఒకరితో ఒకరు పంచుకుంటాయి. దీనివల్ల రెండు దేశాల మధ్య సాంకేతికత ఏకీకరణ జరుగుతుంది. ఫలితంగా బ్రెజిల్ భారత్‌కు ఆర్థిక లాభాలు చేకూరుతాయి. భారత్ పునరుత్పాదక ఇంధనం, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ రంగాలలో చాలా బలంగా



ఉంది. కాబట్టి ఈ ఒప్పందం భారత కంపెనీలకు బ్రెజిల్ మార్కెట్ నుండి యూరప్ వరకు సులభంగా విస్తరించే అవకాశం కల్పిస్తుందని చెప్పవచ్చు. అంతర్జాతీయ, అంతర్జాతీయ సంబంధిత నేరాల నిరోధానికి సంబంధించి కూడా బ్రెజిల్ భారత్ ఒప్పందాలపై సంతకాలు చేశాయి. విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి కుమారన్ మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌లో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడులను ఖండిరచినందుకు ప్రధానమంత్రి మోదీ బ్రెజిల్ అధ్యక్షుడు లూలాకు కృతజ్ఞతలు తెలిపారని చెప్పారు. అలాగే, భారత్ ఉగ్రవాదంతో పోరాడేందుకు అన్ని రకాలుగా కట్టుబడి ఉందని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లూలా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటంలో తమ మద్దతును వ్యక్తం చేశారు.

## స్కూల్‌లో విద్యార్థినులకు గుప్తపరీక్షలు

**షాహాపూర్:** మహారాష్ట్రలో అత్యంత అమానవీయ ఘటన జరిగింది. షాహాపూర్ జిల్లాలోని ఆర్‌ఎస్ దామని స్కూల్‌లో ఐదు నుంచి పది సంవత్సరాల వయస్సు ఉన్న బాలికల బట్టలు విప్పించి రుతుస్రావ పరీక్షలు నిర్వహించారు. బాత్‌రూంలలో రక్తపు మరకలు ఉండటంతో ఈ చర్యకు పాల్పడ్డారు. ఈ విధంగా పిల్లలకు గుప్త పరీక్షలు నిర్వహించడంపై తల్లిదండ్రులు , సామాజిక వేత్తలు నిరసన తెలిపారు. యుక్తవయస్సు పిల్లలను ఎంచుకుని ఈ విధంగా శల్యపరీక్షకు దిగారని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. తమ పిల్లలను బట్టలు తీయించి మరీ పరీక్షించారని , ఇది దారుణం అని తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. రుతుక్రమం గురించి ఈ ఈడు పిల్లలకు సరైన అవగావహన కల్పించాల్సింది. పోయి ఈ విధంగా అమానుషంగా వ్యవహరించడం తమకు బాధాకర విషయం అయిందని బాలిక తల్లి ఒక్కరు వాపోయారు. ఈ స్కూల్ ప్రిన్సిపాల్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు. తమ పిల్లల పట్ల జరిగిన జుగుప్సాకర చర్య గురించి తెలియగానే తల్లిదండ్రులు మరుసటి రోజు స్కూలుకు తరలివచ్చారు. స్కూల్ సిబ్బందిని నిలదీశారు. వీరు ఇందుకు సమాధానంగా బాత్‌రూంల్లో నెత్తుటి మరకల విషయం చెప్పారని , ఇది సహజమే అన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ జరిగిన ఘటనపై పలీసులు స్కూల్ ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టారు. తల్లిదండ్రులకు న్యాయం జరిగేలా చేస్తామని విద్యాశాఖ ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు.




## ఇద్దరు పిల్లల తల్లిని హతమార్చిన సైకో భర్త!

**బెంగళూరు :** నేటి సమాజంలో మానవ సంబంధాలు నానాటికీ దారుణంగా మసకబారుతున్నాయి. చిన్న కారణానికే భార్య భర్తను, భర్త భార్యను, పిల్లలు కన్న తల్లిదండ్రులను, కన్నోళ్లు పిల్లలను చంపుకుంటున్నారు. తాజాగా అలాంటి దారుణం మరొకటి చోటు చేసుకుంది. ఇద్దరు పిల్లల తల్లిని విచక్షణా రహితంగా కొట్టాడో దుర్మార్గపు భర్త. ఆపై ఆమెను కింద పడేసి ఆమె మెడపై కాలు పెట్టి తొక్కి ఊపిరాడకుండా చేసి హతమార్చాడు. ఆమె మృతి చెందిందని నిర్ధారించుకునేంత వరకూ మెడపై కాలుతో తొక్కాడు. దంపతుల మధ్య జరిగిన గొడవ దారుణంగా కక్ష్య పెంచుకుని ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారనైంది. ఇద్దరు పిల్లల తల్లిని హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేగింది. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ దారుణం చోటు చేసుకుంది. కర్ణాటకలోని శ్రీనివాసపూర్‌లో హరీష్ కుమార్, పద్మజ దంపతులు కాపురం ఉంటున్నారు. హరీష్ కుమార్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత బెంగళూరుకి ఉద్యోగం రిత్య షిఫ్ట్ అయ్యారు. ఈ జంటకు ఇద్దరు పిల్లలు. కొంతకాలం బాగానే ఉన్నా ఆ తర్వాత ఈ దంపతులు తరచుగా గొడవ పడసాగారు. ఈ క్రమంలో మంగళవారం (జులై 8) రాత్రి కూడా మరోమారు గొడవ పడ్డారు. హరీష్, పద్మజను కొట్టి, ఆపై నేలకేసి కొట్టాడు. అనంతరం ఆమె మెడపై తన కాలు వేసి ఆమె చనిపోయే వరకు తొక్కి హత మార్చాడు. సమాచారం అందుకున్న బొమ్మనహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని, నిందితుడు హరీష్‌ను అరెస్టు చేశారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భార్యను హత్య చేసిన కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు నిందితుడు హరీష్‌ను ప్రశ్నిస్తున్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో 12 మంది నక్సల్స్ లొంగుబాటు

**దంతేవాడ:** ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలో బుధవారం మొత్తం 12 మంది నక్సలైట్లు అధికారుల ఎదుట లొంగిపొయ్యారు. వీరిలో తొమ్మండుగురిపై కలిపి రూ 28.50 లక్షల నజరానా ప్రకటితం అయి ఉంది. నక్సల్స్ ప్రాబల్య ఈ జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన లాన్ వర్రట్టు అంటే మీ గ్రామానికి, మీ ఇళ్లకు మీరు చేరండి అనే చైతన్య ఉద్యమంలో భాగంగా వీరు సరెండర్ అయ్యారు. వీరి సరెండర్ విషయాన్ని దంతేవాడ ఎస్‌పి గౌరవ్ రాయ్ విలేకరులకు తెలిపారు. 2020 జూన్‌లో తలపెట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే 1005 మంది నక్సల్స్ సరెండర్ అయ్యారు. వీరిలో 249 మందిపై రివార్డులు ఉన్నాయి. క్రమేపీ నక్సలైట్లు తమ పంథా వీడి జనం బాట పట్టడం సంతోషకర పరిణామం అని ఎస్‌పి తెలిపారు. సరెండర్ అయిన వారి సంఖ్య ఇప్పుడు వేయి దాటడటం ప్రభుత్వం చేపట్టిన దూరదృష్టితో



కూడిన కార్యాచరణ పథకాల ఫలితం అని వివరించారు. భద్రతా బలగాల నిరంతర చర్య, స్థానిక తెగల సహకారంతోనే ఇప్పటి పరిణామం సాధ్యం అయిందని తెలిపారు. ఇంతకాలం యువత మావోయిస్టు శుష్క సిద్ధాంతాలకు లొంగిపోయి అడవిదారిపట్టింది. ఇప్పుడు వీరు తిరిగి జనజీవన స్రవంతి లోకి రావడం, తమ ఇళ్లకు, తమ బతుకు పంథాకు చేరడం కీలక పరిణామం అని హర్షం వ్యక్తం చేశారు. సీనియర్ పోలీసు అధికారులు, సిపిఆర్‌ఎఫ్ వర్గాల ఎదుట ఇద్దరు మహిళలు సహా 12 మంది సరెండర్ అయినట్లు చెప్పారు. దట్టమైన అడవులు, మావోయిస్టు నాయకత్వంలో చెలరేగుతున్న విభేదాల క్రమంలో నక్సల్స్ లొంగుబాటు , ప్రత్యేకించి యువతరం ఎక్కువగా లొంగిపోతోందని తెలిపారు. పైగా ప్రభుత్వం చేపడుతున్న పలు పునరావాస పథకాలు , ఊళ్లకు తరలండి కార్యక్రమాల పట్ల ఆకర్షితులు అయ్యి ఈ లొంగుబాటలు సాగుతున్నాయని తెలిపారు. ఇప్పుడు సరెండర్ అయిన వారిలో బుర్సు పుణేం (52), అమిత్ అలియాస్ హింగా బర్సా కూడా ఉన్నారు. వీరు గడ్చిరోలి డివిజన్ మావోయిస్టుల ఒకే దళంలో వీరు చురుకైన పాత్ర పోషిస్తున్నారు. వీరిని పట్టిస్తే రూ 8 లక్షలు చొప్పున ఇస్తామని అధికారులు ప్రకటించారు.


తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# షుగర్ ఉన్నవారు.. చెరుకు రసం తాగొచ్చా..



ఎండాకాలం వచ్చిందంటే చాలు అందరికీ తిప్పలు మొదలవుతూ ఉంటాయి. ఎందుకంటే ఎండ వేడి నుంచి తట్టుకునేందుకు ఎంతో మంది ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ఇక మండే ఎండలకు ఇంటి నుంచి కాలు బయటపెట్టాలంటేనే భయపడిపోతూ ఉంటారు. కానీ ఏం చేస్తాం తప్పని పరిస్థితుల్లో ఉద్యోగమో.. లేదంటే ఇతర పనులను మీద బయటకు వెళ్లాల్సిందే. దీంతో ఎండాకాలంలో బయటికి వెళ్ళినప్పుడు ఉపశమనం కోసం ఏదో ఒకటి తాగడం లాంటివి చేస్తూ ఉంటారు. ఇలా ఎండాకాలం లో ఎక్కడికి వెళ్తున్నా అందుబాటులో ఉండే పానీయం ఏదైనా ఉంది అంటే అది చెరుకు రసం అని చెప్పాలి. రోడ్డు వెంట వెళ్తుంటే ప్రతిచోట ఇలా చెరుకు రసం బండ్లు కనిపిస్తూ ఉంటాయి. ఈ క్రమం లోనే ఇలా ఎండ వేడిని తట్టుకునేందుకు కాస్త ఉపశమనాన్ని పొందేందుకు ఎంతో మంది చెరుకు రసం తాగడం లాంటివి చేస్తూ ఉంటారు అన్న విషయం తెలిసిందే. అయితే కొంతమంది మాత్రం చెరుకు రసం తాగడానికి భయపడిపోతూ ఉంటారు. వాళ్లే ఇక మధుమేహంతో బాధపడుతున్న వారు. సాధారణంగా చెరుకు రసంలో తీపి ఎక్కువగా ఉంటుంది అన్న విషయం తెలిసిందే. ఈ క్రమం లోనే అటు షుగర్ తో బాధ పడుతున్న వారు చెరుకు రసం తాగొచ్చా లేదా అని ఎప్పుడూ అనుమాన పడుతూ ఉంటారు. ఈ అనుమానం తోనే కొన్నిసార్లు తాగకుండా సైలెంట్ గానే ఉండిపోతారు. అయితే మధుమేహం ఉన్నవారు చెరుకు రసం తాగొచ్చా అంటే అసలు వద్దంటున్నారు వైద్య నిపుణులు. ఇవి జ్యూస్ తాగినప్పుడు మధుమేహం లేని వారిలో కూడా షుగర్ లెవెల్స్ స్వల్పంగా పెరిగినట్లు అధ్యయనం లో తేలింది అంటూ చెబుతున్నారు. చెరుకు రసంతో పలు ఉపయోగాలు ఉన్నప్పటికీ డయాబెటిస్తో బాధపడుతున్న వారు మాత్రం దానికి దూరంగా ఉండటమే మంచిది అని సూచిస్తున్నారు.

# మూత్రం పసుపు రంగులో వస్తే..?



మానవ శరీరంలో చాలా ముఖ్యమైన అవయవాలలో కిడ్నీలు కూడా ఒకటి.ఇది మన శరీరంలోని రక్తం నుండి మురికిని అదనపు ద్రవాలను సైతం ఫిల్టర్ చేయడానికి ఉపయోగపడుతుంది.అలాగే రక్తపోటు ఎర్ర రక్త కణాలను నియంత్రించే హార్మోన్లను కూడా ఉత్పత్తి చేస్తుంది. అందుకే మన శరీరంలో చాలా ముఖ్యమైనవిగా చెబుతూ ఉంటారు.

మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు ఆకలి లేకపోవడం, పాదాలు వాయడం, దురద చర్మం శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తక్కువ మూత్ర విసర్జన వంటి లక్షణాలు ఉంటాయి అలాగే పసుపు మూత్రం కూడా వచ్చినట్టుగా అనిపిస్తుంది.


మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉండాలి అంటే మనం డైట్ లో మూత్రపిండాలను శుభ్రపరిచే ఆహారాలను సైతం తీసుకోవలసి ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల మూత్రపిండాల పనితీరు కూడా మెరుగుపడుతుంది. దీనివల్ల మన శరీరంలో ఉండే విష పదార్థాలు కూడా బయటకి రావడానికి సహాయపడుతుంది. అలాంటి వాటిలో కూరగాయలు మూత్రపిండాలలోని విషయాన్ని సైతం తొలగించడానికి చాలా ఉపయోగపడుతుంది. ఫైబర్ పుష్కలంగా ఉండేటువంటి వాటిని తినడం వల్ల మూత్రపిండాలు సరిగ్గా పనిచేయడానికి సహాయపడతాయట. ముఖ్యంగా క్యాబేజీ ,కాలీఫ్లవర్, బ్రోకలీ వంటి వాటిని తినాలి.స్ట్రాబెర్రీ ,బ్లూబెర్రీ ఇతరత్రా బెర్రీలలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి మూత్రపిండాలు ఆరోగ్యానికి సహాయపడతాయి. అలాగే కిడ్నీ కణజాలానికి హాని కలిగించే ఆక్సీకరన నుంచీ బయటపడేలా చేస్తుంది.ఆకుకూరలలో బచ్చలాకుకూర ,మెంతికూర ఇతరత్రా ఆకుకూరలలో విటమిన్లు ఖనిజాలు చాలా పుష్కలంగా ఉంటాయి. ఇవి మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి.నారింజ ,నిమ్మ ,ద్రాక్ష పండు వంటి వాటిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది.ఇది మూత్రపిండంలో రాళ్లు పడకుండా నిరోధించడానికి సహాయపడుతుంది. సిట్రిక్ పండ్లను తాజా పండ్లుగా తినడమే చాలా మంచిది.



# ఖాళీ కడుపుతో ఎన్ని గ్లాసుల నీళ్లు తాగడం మంచిది..


ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవడం చాలా ముఖ్యం. ఈ ఆరోగ్యకరమైన అలవాట్లలో ఒకటి ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో నీళ్లు తాగడం.ఖాళీ కడుపుతో నీళ్లు తాగడం వల్ల జీర్ణక్రియ ప్రక్రియ మెరుగుపడుతుంది. దీంతో శరీరంలో పేరుకుపోయిన మురికి సులభంగా తొలగిపోతుంది. ఇది మాత్రమే కాదు, ఇతర వ్యక్తులతో పోలిస్తే ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో నీరు తాగే వారిలో కిడ్నీ, రాళ్ల సమస్యలు తక్కువగా కనిపిస్తాయి. శరీరం ఆరోగ్యంగా ఉండటానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, మనం ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో నీళ్లు తాగాలి. అయితే ఖాళీ కడుపుతో ఎన్నిగ్లాసుల నీళ్లు తాగడం వల్ల ప్రయోజనం ఉంటుందనే ప్రశ్న తరచుగా చాలామంది ప్రజల మదిలో మెదులుతుంది. చాలామంది ఉదయం నీళ్లు తాగడం వల్ల కలిగే ప్రయోజనాలను గురించి చెబుతుంటారు. అయితే ఇప్పుడు మనం ప్రతిరోజు ఉదయాన్నే ఎన్నిగ్లాసుల నీళ్లు తాగాలో తెలుసుకుందాం. మీరు ఉదయం నిద్రలేచిన వెంటనే మొదట చేయవలసిన పని మీ పళ్ళు తోముకోవడం, మీకు టీ తాగే అలవాటు ఉంటే, దానికి బదులుగా నీరు తాగటం అలవాటు చేసుకోండి. ఉదయం నిద్ర లేవగానే కనీసం 2-3 గ్లాసుల నీళ్లు తాగాలి. మీరు ఒకేసారి ఎక్కువ నీళ్లు తాగలేకపోతే, ఒక గ్లాసు నీటితో ప్రారంభించండి. క్రమంగా కొన్ని రోజుల్లో 2 - 3 గ్లాసుల నీళ్లు తాగడం ప్రారంభించండి. మీరు ఉదయాన్నే తాగు నీటిని గోరువెచ్చగా చేయండి. ఇది మీ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. గోరువెచ్చని నీటిని తాగడం వల్ల మీ జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా రోగనిరోధక శక్తిని కూడా బలపరుస్తుంది. వేడి నీటిని తాగడం వల్ల మీ జీర్ణ వ్యవస్థ చురుగ్గా ఉంటుంది. అయితే నీళ్లు తాగిన తర్వాత కనీసం అరగంట వరకు ఏమి తినకూడదు లేదా తాగకూడదు అని గుర్తుంచుకోండి.

# రోజూ కివి తింటే ఎన్ని ప్రయోజనాలో..



ప్రజలు తమ డైట్ లో కచ్చితంగా పండ్లను చేర్చుకోవాలని వైద్యనిపుణులు చెబుతుంటారు. పండ్లను తినడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని చెబుతారు. నిజానికి, పండ్లలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. అయితే పండ్లలో కూడా కొన్ని పండ్లను పోషకాల నిధిగా చెబుతారు. ఈ పండ్లలో ఒకటి కివి. ఇది రుచిలో తియ్యగా, పుల్లగా ఉంటుంది. అందుకే చాలామంది దీన్ని ఎక్కువగా ఇష్టపడతారు. అయితే తియ్యగా, పుల్లగా ఉంటే ఈ కివీ అనేక తీవ్రమైన వ్యాధుల నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. అయితే ఈ రోజూ కివి పండును ఎంత మోతాదులో తినాలి, దాని ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. కివితో కలిగే ప్రయోజనాలు.. కివిలో పొటాషియం, ఫైబర్, విటమిన్ సి, ఫోలిక్ యాసిడ్, విటమిన్ ఇ, పాలీఫెనాల్స్ పుష్కలంగా లభిస్తాయి. అలాగే కివిలో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి. అందుకే బరువు తగ్గాలనుకునే వారికి ఈ పండు అమృతం లాంటిది. అంతే కాదు అనేక వ్యాధులను నివారించడంలో ఈ పండు సంజీవనిలా పనిచేస్తుంది.

1. కంటి చూపు.. కంటి చూపును మెరుగుపరచడానికి కివి ఎంతగానో ఉపయోగపడుతుందంటున్నారు నిపుణులు. రోజువారి డైట్ లో కివీని చేర్చుకుంటే చూపు మందగించే సమస్య నుంచి బయటపడతారు. 2. రోగనిరోధక శక్తి.. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు రోజుకు ఒక కివీని తినాలంటున్నారు నిపుణులు. కివిలో విటమిన్ సి ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. 3. మలబద్ధకం నుండి ఉపశమనం.. మలబద్ధకం, అజీర్ణం, కడుపు నొప్పి వంటి సమస్యలతో బాధపడుతున్నట్లయితే ప్రతిరోజు కివీని తినడం మర్చిపోవద్దు. రోజుకు 23 కివీస్ తింటే మలబద్ధకం సమస్య నుండి బయటపడవచ్చని చెబుతున్నారు నిపుణులు. 4. హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.. కివీని రోజూ తీసుకోవడం వల్ల మీ గుండె చాలా కాలం పాటు ఆరోగ్యంగా ఉంటుంది. ఇందులో ఉండే పీచు, పొటాషియం చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించి ధమనులను బలోపేతం చేస్తాయి.



# నిద్ర పట్టకపోతే కంటి ఆరోగ్యం షెడ్డుకే..?

మనం సరిగ్గా నిద్రపోతున్నారో లేదో ముందుగా చెక్ చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే కంటి ఆరోగ్యానికి సరైన నిద్ర అవసరం. మనం రోజంతా ఎన్ని పనులు చేసినా, ఎంత బిజీగా ఉన్నా రాత్రిపూట బాగా నిద్రపోవాలి. తగినంత నిద్ర లేనప్పుడు శరీరంలో అనేక రకాల సమస్యలు వస్తాయి. నిద్ర మొత్తం ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. నిద్ర కంటి ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుందని చాలా మందికి తెలియదు. శరీరంలోని మిగిలిన భాగాల మాదిరిగానే, కళ్ళకు విశ్రాంతి మరియు పునరుజ్జీవనానికి సమయం కావాలి. నిద్రపోతున్నప్పుడు కళ్లు తాజాగా ఉంటాయి. ఇది మంచి దృష్టి మరియు కంటి పనితీరులో సహాయపడుతుంది. ఈ రాత్రి ప్రక్రియలో రోజంతా పేరుకుపోయిన దుమ్ము, అలెర్జీ కారకాలు మరియు చికాకులను బయటకు పంపడానికి కళ్లను లూబ్రికేట్ చేయడం ఉంటుంది. తగినంత నిద్ర లేకపోవడం వల్ల కంటి సమస్యలు వస్తాయి. వాటిలో ఒకటి డ్రై ఐ సిండ్రోమ్. తగినంత నిద్ర లేకపోవడం వల్ల కళ్లు హైడ్రేట్‌గా ఉండే అవకాశాలు తగ్గుతాయి. ఇది చికాకు, కళ్ళు ఎర్రబడటం, పొడిబారడం వంటి బాధించే సమస్యలను కలిగిస్తాయి. వీటితో పాటు దృష్టి లోపం కూడా రావచ్చు. నిద్ర లేకపోవడం వల్ల తలెత్తే మరో సమస్య ఫ్లాపీ ఐలిడ్ సిండ్రోమ్. కళ్లకు తగినంత విశ్రాంతి లభించనప్పుడు వచ్చే సమస్య ఫ్లపీ ఐలిడ్ సిండ్రోమ్. ఈ రుగ్మత నిద్రపోతున్నప్పుడు కనురెప్పలలో అసౌకర్యాన్ని కలిగిస్తుంది. సహజ రక్షణ విధానాలకు భంగం కలిగించడం, చికాకు మరియు కార్నియల్ రాపిడికి దారి తీస్తుంది. నిద్ర నాణ్యత, కంటి చూపు మధ్య మరొక ప్రత్యక్ష లింక్ ఏమిటంటే, నిద్ర లేకపోవడం కంటి లెన్స్‌ను కేంద్రీకరించడానికి బాధ్యత వహించే కండరాలను బలహీనపరుస్తుంది. ఇది ట్రాన్సియెంట్ మయోపియా, షార్ట్ టర్మ్ దగ్గరి చూపు వంటి దృష్టి సమస్యలకు దారితీస్తుంది. సుదూర వస్తువులను స్పష్టంగా చూసే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది.

# జుట్టు సమస్యలతో విసుగెత్తిపోతున్నారా..?



మండుతున్న ఎండల నుండి ఉపశమనం పొందాలనుకునే మనందరికీ సబ్జా నీరు చక్కటి పరిష్కారం.. ఈ సబ్జా గింజలను నీటిలో నానబెట్టి ఆ నీటిని తాగడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. రోజూ ఉదయాన్నే సబ్జా గింజలు నానబెట్టిన నీటిని తాగడం అలవాటు చేసుకుంటే జుట్టు సమస్యలన్నీ తొలగిపోతాయి.. నల్లని జుట్టును పొందవచ్చు. వికారంగా, వాంతి వచ్చే విధంగా ఉంటే సబ్జా గింజల పానీయం తాగడం ఉత్తమం. గొంతు మంట, దగ్గు, ఆస్తమా, తలనొప్పి, జ్వరం వంటి ఆరోగ్య సమస్యలు దూరమవుతాయి. ఈ మధ్యకాలంలో అందరినీ వేధిస్తున్న సమస్య జుట్టు రాలడం.. ఈ సమస్య ఉన్నవారు రోజూ ఉదయాన్నే సబ్జా వాటర్ తాగడం అలవాటు చేసుకుంటే ఖచ్చితంగా జుట్టును రూట్ నుంచి దృఢపరుస్తుంది. ఈ నివారణకు ఈరోజు ఒక చెంచా సబ్జా గింజలను ఒక గ్లాసు నీటిలో వేసి కనీసం 30 నిమిషాలు నాననివ్వండి, ఆపై ఆ నీటిలో ఒక చెంచా నెయ్యి మరియు సగం నిమ్మరసం వేసి తాగాలి. ఈ తరహా డ్రిరక్ ను రెగ్యులర్ గా తాగడం వల్ల జుట్టు సమస్యలే కాకుండా గుండెల్లో మంట, అజీర్ణం వంటి ఆరోగ్య సమస్యలను కూడా తగ్గించుకోవచ్చు. పోషక విలువలున్న సబ్జా గింజలు కాస్త గట్టిగానే ఉంటాయి..కానీ ఈ గింజల్లో పీచు, ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి.. ప్రత్యేకంగా ఇవి బరువు తగ్గడంలో సహాయపడతాయి. ఈ సబ్జా గింజల పానీయం కేవలం చలవ చేయడం మాత్రమే కాదు మన ఒంటికి ఎంతో మెరుగైన ఆరోగ్యాన్ని అందిస్తుంది. అధిక బరువు, మలబద్ధకం, మధుమేహం, డీహైడ్రేషన్, శ్వాసకోస వ్యాధులు ఇలా చాలా వాటికి సబ్జా గింజలు మంచి మందుగా పనిచేస్తాయి. సబ్జా గింజల్లో శరీరానికి అవసరమైన ఫ్యాటీ యాసిడ్లు, పీచు పదార్థం సమృద్ధిగా ఉంటాయి. సబ్జా గింజల పానీయం తాగితే మహిళలకు ఫోలేట్, నియాసిన్, విటమిన్ ఇ వంటి పోషకాలు లభిస్తాయి. ఇవి వారికి ఎంతగానో అవసరం. సబ్జా గింజలు చర్మానికే కాదు జుట్టుకు కూడా మేలు చేస్తాయి. దీనిలో విటమిన్ 'కె', బీటా కెరోటిన్, ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి వెంట్రుకలు, కుదుళ్లు దృఢంగా మారేలా చేస్తాయి. అలాగే ఇవి కురులకు పోషణను అందించి పట్టులా, మృదువుగా మారేలా చేస్తాయి. సబ్జా గింజలను రోజూ ఆహారంలో భాగం చేసుకుంటే జుట్టు రాలే సమస్య నుంచి కూడా విముక్తి పొందచ్చంటున్నారు నిపుణులు.

# మడమల పగుళ్లకు కొబ్బరి నూనె..



పాదాలను శరీరానికి పునాదిగా పరిగణిస్తారు. మొత్తం శరీరం బరువు పాదాలపైనే ఉంటుంది. మన శరీరాన్ని కదిలించేది పాదాలు. అందుకే పాదాల సంరక్షణ చాలా ముఖ్యం. పొడి వాతావరణంలో మడమల పగుళ్ల సమస్య సాధారణం. మహిళలు ఎక్కువగా ఈ సమ్యతో బాధపడతారు. తేమ లేకపోవడం, విటమిన్ లోపం, మధుమేహం, థైరాయిడ్, ఊబకాయం, 60 ఏళ్లు పైబడిన వారు మడమల పగుళ్ల సమస్యను ఎదుర్కోవలసి ఉంటుంది. మీరు కూడా పగిలిన మడమల సమస్యతో పోరాడుతూ ఉంటే, అది జన్యుపరమైన లేదా ఆరోగ్య కారణాల వల్ల కావచ్చు. దీనికి కారణం, నివారణ మార్గాలను ఇక్కడ తెలుసుకుందాం.. పాదాల పట్ల అజాగ్రత్తగా ఉండటం వల్ల సాధారణంగా మడమల పగుళ్ల సమస్య పెరుగుతుంది. చెప్పులు లేదా ఓపెన్ షూలను ఉపయోగించడం వల్ల కూడా మడమల పగుళ్లు ఏర్పడతాయి. చాలా సార్లు పాదాల మడమలలో లోతైన పగుళ్ల కారణంగా భరించలేని నొప్పిని ఎదుర్కోవలసి ఉంటుంది. మీ పాదాల చర్మం తరచుగా పొడిగా మారుతుంది. పొడిబారినప్పుడు, అది మడమల పగుళ్లకు కారణం అవుతుంది. శరీరంలో తేమ లేకపోవడం వల్ల, సజీవ కణాలు గట్టిపడతాయి. మడమల ప్రాంతంలో చనిపోయిన కణాలు పెరుగుతాయి. మీ చర్మానికి యవ్వనాన్ని, తాజాదనాన్ని తీసుకురావడానికి, వారానికి ఒకసారి మీ పాదాలకు ఇంట్లోనే పెడిక్యూర్ చేసుకోండి. గోరువెచ్చని నీటిలో పాదాలను ముంచడం వల్ల మడమల చర్మం మృదువుగా మారుతుంది. మృతకణాలను తొలగించడంలో సహాయపడుతుంది. ప్రతిరోజూ మీ పాదాలు, మడమల సరైన సంరక్షణ కోసం ప్రతిరోజూ స్నానానికి ముందు మీ పాదాలను స్వచ్ఛమైన బాదం నూనెతో మసాజ్ చేయండి. స్నానం చేసిన తర్వాత, పాదాలు తడిగా ఉన్నప్పుడే క్రీమ్ అప్లై చేయండి. ఇది పాదాలపై తేమను నిలుపుదల చేస్తుంది. ఫుట్ క్రీమ్‌తో మీ పాదాలను సర్క్యులర్ మోషన్‌లో తేలికగా మసాజ్ చేయండి. ఇది మీ పాదాలను మృదువుగా ఉంచుతుంది. మడమల పగుళ్ల సమస్యను నివారిస్తుంది. పాదాల సమస్యలకు తేనె సహజ నివారణగా పనిచేస్తుంది. తేనెలో యాంటీ బాక్టీరియల్, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి పగిలిన మడమలను శుభ్రం చేస్తాయి. పగిలిన మడమలకు సహజంగా చికిత్స చేస్తాయి. పగిలిన మడమల కోసం సహజ చికిత్స మీ వంటగదిలో కూడా అందుబాటులో ఉంది. నిమ్మకాయను కోసి అందులో సగం తీసుకుని అందులో పంచదార కలిపి మడమల మీద మెత్తగా రుద్ది తర్వాత శుభ్రమైన మంచినీటితో మడమలను కడగాలి. వారానికి రెండుసార్లు ఈ ప్రక్రియను అనుసరించడం వల్ల మంచి సానుకూల ఫలితాలు వస్తాయి. మడమల పగుళ్లకు కొబ్బరి నూనె దివ్యౌషధంలా పనిచేస్తుంది.

# పవన్ అభిమానులకు పండగే..!

## లార్డ్ శివ, విష్ణు అవతారాల్లో హరిహరవీరమల్లు..



టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ హరిహరవీరమల్లు. జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నా ఈ మూవీ రెండు పార్టులుగా తెరకెక్కుతుండగా.. హరిహరవీరమల్లు పార్ట్ 1 జులై 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో మేకర్స్ ఏదో ఒక అప్‌డేట్ అందిస్తూ అభిమానులు, మూవీ లవర్స్‌లో జోష్ నింపుతున్నారు. ఇప్పటివరకు విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ సినిమా థీమ్ ఎలా ఉండబోతుందో చెబుతూనే.. పవన్ కల్యాణ్ హరిహరవీరమల్లుగా బాక్సాఫీస్‌పై దండయాత్ర చేయడం పక్కా అని చెప్పకనే చెబుతున్నాయి. అయితే తాజాగా మరో ఆసక్తికర వార్త నెట్టింట రౌండప్ చేస్తోంది. హరిహర వీరమల్లు పురాణాలతో మిళితమైన ఓ కల్పిత కథనం అట. లీడ్ రోల్ హరిహరవీరమల్లు పాత్ర సనాతన ధర్మాన్ని కాపాడే లార్డ్ విష్ణు, లార్డ్ శివను ప్రతిబింబించేలా ఉండబోతుందంటే ఇండస్ట్రీ సర్కిల్‌లో ఓ క్రేజీ న్యూస్ హాట్ టాపిక్‌గా మారింది. టైటిల్‌లో హరి (విష్ణు) హర (శివుడు) వచ్చే పేర్లు ఈ విషయంపై క్లారిటీ ఇచ్చేస్తున్నాయి. హరిహరవీరమల్లు పోస్టర్‌లో ఓ వైపు విష్ణువు వాహనం గరుడ పక్షిని ప్రతిబింబించే డేగ కనిపిస్తుండగా.. మరోవైపు శివుడిని చూపించే ఢమరుకం పట్టుకుని ఉండటం చూడొచ్చు. ఇక పవన్ కల్యాణ్ నుంచి వస్తోన్న తొలి పాన్ ఇండియా సినిమా కావడంతో మొదటి సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ అవుతోంది. ఇక ట్రైలర్‌కు వస్తున్న స్పందనతో భారీ మొత్తానికి పంపిణీ హక్కులను సొంతం చేసుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు పోటీపడుతున్నట్టు ఇండస్ట్రీ సర్కిల్ సమాచారం. పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. బాలీవుడ్ యాక్టర్, దర్శక నిర్మాత అనుపమ్ ఖేర్, బాబీ డియోల్, అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని ఏఎం రత్నం సమర్పణలో మేఘ సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఏ దయాకర్‌రావు నిర్మిస్తున్నారు.



# క్రిష్ వెళ్లిపోవడానికి గల కారణం ఇదే..!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'హరి హర వీరమల్లు'. జులై 24న ఈ చిత్రం రావడం పక్కా అని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఇక రిలీజ్ డేట్ దగ్గరపడుతుండడంతో ప్రమోషనల్ కార్యక్రమాల విషయంలో స్పీడ్ పెంచాలని మేకర్స్ భావిస్తున్నారు. తాజాగా నిర్మాత ఏ ఎం రత్నం ఓ ఇంటర్వ్యూలో తన మనసులోని విషయాలను వెల్లడిరచారు. మా సినిమా దాదాపు 14 సార్లు వాయిదా పడిరదంటూ మీడియాలో వార్తలు రావడం చాలా బాధించింది. కోపం కూడా వచ్చింది. నిజానికి మా సినిమా విడుదలను కేవలం మూడు సార్లు మాత్రమే మార్చామన్నారు. మార్చి 28, మే 9, జూన్ 12 తేదీల్లో విడుదల చేయాలనుకున్నాం. అయితే జూన్ 12న విడుదల చేయలేకపోయినప్పుడు నాకు వ్యక్తిగతంగా ఎంతో బాధేసింది. నా కెరీర్‌లో ఇప్పటివరకు ఏ సినిమాని కూడా ఒక్కసారి కూడా వాయిదాలేదు అని ఆయన పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన గ్రాఫిక్స్ వర్క్ చాలా భారీ స్థాయిలో ఉంది. 'బాహుబలి' వంటి సినిమాలు కూడా వీఎఫ్ఎక్స్ పనుల వల్లే ఆలస్యం అయ్యాయి. అలాగే కోవిడ్ 19, తర్వాత ఎన్నికల ప్రభావం వల్ల కొంతకాలం షూటింగ్ ఆగిపోయింది. మాకు ఎదురైన ఆలస్యం వెనుక వ్యాపార పరమైన కారణాలు లేవు అని ఏఎం రత్నం తేల్చిచెప్పారు. పవన్ కల్యాణ్ రాజకీయాలలో కాస్త బిజీగా ఉండటం వలన రిలీజ్ డేట్ విషయంలో పక్కా క్లారిటీ ఇవ్వలేకపోయాం అని ఆయన పేర్కొన్నారు. ఇక ఈ చిత్రాన్ని మొదట క్రిష్ తెరకెక్కించగా, తర్వాత ఏఎం రత్నం దర్శకుడు జ్యోతికృష్ణ డైరెక్ట్ చేశాడు. అయితే ఈ ప్రాజెక్టు నుంచి క్రిష్ వెళ్లిపోవడానికి కారణం, ఆయనకి మరో కమిట్ మెంట్ ఉండటమే అని తెలియజేశారు రత్నం. జ్యోతికృష్ణకి దర్శకత్వ బాధ్యతలని అప్పగించాలని చెప్పింది కూడా పవన్ కళ్యాణ్ గారే. ఇక సినిమా విడుదలకి నాలుగు రోజుల ముందు ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్లాన్ చేస్తాము. వర్షాలు లేని పక్షంలో తిరుపతిలో చేస్తాము. ఒక వేళ వర్షాలు ఉంటే విజయవాడ ఇండోర్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాము అని ఏఎం రత్నం తెలియజేశారు. ఈ సినిమా పవన్ కల్యాణ్ స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లడం ఖాయం నమ్మకాన్ని ఏఎం రత్నం వ్యక్తం చేశారు ఏఎం రత్నం.




# దసరా విలన్ ఆ నటికి పబ్లిక్‌గా క్షమాపణలు..!

పబ్లిక్‌గా ఆ నటికి క్షమాపణలు చెప్పిన దసరా విలన్.. ఆయన ప్రవర్తనపై చర్చ తెలుగు ప్రేక్షకుల్లో 'దసరా' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న మలయాళ నటుడు షైన్ టామ్ చాకో. ఈ సినిమా తరువాత 'దేవర' సహా పలు చిత్రాల్లో తన నటనతో ఆకట్టుకున్నారు. అయితే కొన్ని నెలల క్రితం చాకోకు, నటి విన్సీ సోనీ అలోషియస్‌కు మధ్య జరిగిన వివాదం మలయాళ ఫిల్మ్ ఇండస్ట్రీలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. తాజాగా, ఈ వివాదానికి ముగింపు పలకుతూ చాకో పబ్లిక్‌గా క్షమాపణలు చెప్పడం జరిగింది. ఇద్దరూ కలిసి నటించిన 'సూత్రవాక్యం' సినిమా ప్రమోషన్ కోసం ఇద్దరూ ఒకే వేదికపై కనిపించారు. అక్కడే టామ్ చాకో మాట్లాడుతూ.. నా ప్రవర్తన వల్ల విన్సీకి కలిగిన బాధకు హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నాను. కావాలని అలా చేయలేదు. సరదాగా మాట్లాడిన మాటలే అవి. కానీ ఆ మాటలు ఇంతవరకూ వెళ్తాయని ఊహించలేదు అని చెప్పుకొచ్చారు. అలాగే, విన్సీ స్పందించిన తీరు గురించి మాట్లాడుతూ .. ఆమెని ఎవరైన ప్రేరేపించారేమో అనిపించింది అని అన్నాడు టామ్ చాకో. ఇక టామ్ మాటలకి విన్సీ వెంటనే స్పందిస్తూ.. ఆ సమయంలో నిజంగానే నాకు అసౌకర్యంగా అనిపించింది. అతను అలా ప్రవర్తిస్తారని అనుకోలేదు. నేను స్పందించిన తీరు కూడా అతని కుటుంబాన్ని బాధించింది. ఇప్పుడు వివాదం ముగిసింది అని చెప్పుకొచ్చింది. ఆ వెంటనే మాట్లాడిన చాకో నిజంగా నేను నిన్ను బాధపెట్టి ఉంటే క్షమించు అని అన్నాడు. దాంతో విన్సీ.. ఆ మాట నా మనసును తాకింది. ఇప్పుడు ఆయనపై గౌరవం మరింత పెరిగింది అని చెప్పుకొచ్చింది. 2023 ఏప్రిల్‌లో ఒక ఇంటర్వ్యూలో విన్సీ.. "షైన్ టామ్ చాకో సెట్స్‌లో అసౌకర్యంగా ప్రవర్తించారు. ఈ విషయాన్ని మలయాళ ఫిల్మ్ ఛాంబర్‌కు ఫిర్యాదు చేశాను. చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్న ఉద్దేశం లేదు. కానీ ఇండస్ట్రీలో మహిళల హక్కులకు పెద్దలు స్పందించాలి అని చెప్పినట్టు పేర్కొంది. అయితే ఇప్పుడు ఈ వివాదానికి ముగింపు పలకడంతో ఫిల్మ్ ఇండస్ట్రీలో చాలామంది ఊపిరి పీల్చుకున్నారు. బాధ్యతగా ప్రవర్తించి పబ్లిక్‌గా క్షమాపణలు చెప్పిన షైన్ టామ్ చాకో, సంయమనంతో స్పందించిన విన్సీ ఇద్దరూ ప్రొఫెషనల్‌గా ముందుకు సాగుతున్న తీరు మెచ్చుకోదగినది అని పలువురు కామెంట్ చేస్తున్నారు. ఇక ఇదిలా ఉంటే ఇటీవల టామ్ చాకో కుటుంబాన్ని విషాదం వెంటాడిరది. తమిళనాడులో రోడ్డు ప్రమాదంలో ఆయన తండ్రి సి.పి. చాకో మరణించగా, టామ్ చాకోతో పాటు ఆయన తల్లి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం సేలం %% బెంగళూరు జాతీయ రహదారిపై ధర్మపురి సమీపంలో జరిగింది.

# ఆలియా భట్‌కు చేదు అనుభవం..!

## ఫేక్ బిల్లులతో.. రూ.77 లక్షల మోసం

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ కు తీవ్ర చేదు అనుభవం ఎదురైంది. ఈ విషయం కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయం కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తన వద్ద వ్యక్తిగత సహాయకురాలిగా పని చేసిన వేదిక ప్రకాశ్‌శెట్టి ఆర్థిక వ్యవహారాల్లో తప్పడు లెక్కలు చూపి రూ.77 లక్షల మేర మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పుడీ విషయం బాలీవుడ్‌తో పాటు టోటల్ ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో టాక్ ఆఫ్ ది టౌన్ అయింది. 2021 నుంచి 2024 మధ్య కాలం వరకు ఆలియా పర్సనల్ అసిస్టెంట్ గా పని చేసిన వేదికా ప్రకాశ్ శెట్టి. ఆలియా నిర్మాణ సంస్థ ఎటర్నల్ సన్‌షైన్ ప్రొడక్షన్స్ ఆర్థిక లావాదేవీలన్నింటినీ చక్కబెట్టేది. అయితే, ఆలియా తల్లి, సినీ నటి సోని రజ్‌దాన్ ఇటీవల కొన్ని లెక్కలపై అనుమానం వచ్చి పరిశీలించగా, వేదిక తప్పడు బిల్లులు సమర్పిస్తూ భారీ మొత్తాన్ని కాజేసిందని అర్థమైంది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు అయింది. ఆలియాకు సంబంధించిన ప్రయాణాలు, మీటింగ్స్, ఈవెంట్ ఖర్చుల పేరుతో పాటు ఆలియా వ్యక్తిగత ఖాతాల్లోంచి కూడా వేదిక ఫేక్ బిల్లులు సమర్పించి రూ.77 లక్షల మేర వంచించిందని, పోలీసులు వెల్లడిరచారు. ఆపై ఈ వ్యవహారం కాస్త వెలుగులోకి రావడంతో పోలీసుల దర్యాప్తు మొదలవగానే వేదికా పరారయ్యింది. రాజస్థాన్ అక్కడి నుంచి కర్ణాటక, ఆపై పూణే వంటి ప్రాంతాల్లో తిరుగుతూ చివరకు బెంగళూరులో పోలీసులకు చెక్కింది. దీంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని ముంబైకి తరలించారు.





# డ్రగ్స్ కేసులో బెయిలు మంజూరు

- జైలు నుంచి విడుదలైన హీరో శ్రీరామ్ శ్రీకాంత్, కృష్ణ

మాదకద్రవ్యాల కేసులో నటులు శ్రీరామ్ శ్రీకాంత్, కృష్ణలకు నిబంధనలతో కూడిన బెయిలు మంజూరైంది. మాదక ద్రవ్యాల వినియోగం కేసులో గత నెలలో అరెస్టయి జైలులో ఉన్న శ్రీకాంత్, కృష్ణ తమకు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లు సోమవారం న్యాయమూర్తి నిర్మల్ కుమార్ విచారించారు. ఈ కేసులో మొదటి నిందితుడు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా నటుడు శ్రీకాంత్ను అరెస్ట్ చేశారని, అరెస్ట్ చేసిన సమయంలో శ్రీకాంత్ వద్ద ఎలాంటి మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకోలేదని శ్రీకాంత్ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. కృష్ణకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో మాదకద్రవ్యాలు వినియోగించినట్లు నిరూపణ కాలేదని కృష్ణ తరఫు న్యాయవాది వివరించారు. అయితే.. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ చేసిన మాజీ నేత నిందితుల వాంగ్మూలం ఆధారంగా శ్రీకాంత్, కృష్ణలను అరెస్ట్ చేసినట్లు, వారికి బెయిలు మంజూరు చేయరాదని పోలీసుల తరఫు న్యాయవాది కోరారు. వాదనల అనంతరం శ్రీకాంత్, కృష్ణ బెయిలుపై తీర్పును న్యాయమూర్తి, మంగళవారానికి వాయిదా వేశారు. దీంతో.. మంగళవారం న్యాయమూర్తి వారికి బెయిలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రూ.10 వేల సొంత పూచీకత్తు, అదే మొత్తంలో ఇద్దరు పూచీకత్తు సమర్పించాలని, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు దర్యాప్తు అధికారి ముందు హాజరై సంతకం చేయాలని న్యాయమూర్తి నిబంధనలు విధించారు.

# 'బ్యాడ్ గర్ల్' విడుదలకు గ్రీన్ సిగ్నల్..!

తమిళం నుంచి వస్తున్న వివాదాస్పద చిత్రం బ్యాడ్ గర్ల్. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్, కోలీవుడ్ డైరెక్టర్ వెట్రిమారన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అంజలి శివరామన్ కథానాయికగా నటిస్తుంది. వర్షా భరత్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమా విడుదలకు సెన్సార్ పలు అడ్డంకులు తెలిపిన విషయం తెలిసిందే. ఈ సినిమా విషయంలో సెన్సార్ బోర్డు మీదా కోర్టు వరకు కూడా వెళ్లాడు వెట్రిమారన్. అయితే ఎన్నో వివాదాలు ఎదుర్కోన్న ఈ చిత్రం తాజాగా సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ చెప్పిన పలు కట్‌లకు చిత్రబృందం అంగీకరించడంతో సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చింది బోర్డు. ఈ క్రమంలోనే ఈ చిత్రం విడుదలకు సిద్ధంమైంది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ టీమ్ పోస్ట్ పెట్టింది. స్కూల్ స్టేజీ నుంచే తోటి విద్యార్థులలాగే తనకు ఓ బాయ్‌ఫ్రెండ్ ఉండాలనుకునే ఓ అమ్మాయి కథ ఈ చిత్రం. ఆచారాలు, కట్టుబాట్లు పాటించే కుటుంబంలో పుట్టిన ఈ అమ్మాయి తనకు నచ్చిన వాడిని ఎలా ఎంపిక చేసుకుంది. ఈ క్రమంలో ఆ అమ్మాయి జీవితంలో ఎదురైన సంఘటనలు ఏంటి అనేది ఈ సినిమా కథ. ఏ గ్రాస్ రూట్ ఫిల్మ్ కంపెనీ ప్రొడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది.




# హృతిక్ రోషన్‌తో పనిచేయడం ఎంతో సరదా..!

జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ 'వార్ 2'. 2019లో విడుదలై ఘనవిజయం సాధించిన 'వార్'కు ఇది సీక్వెల్. తాజాగా, ఈ సినిమా షూట్ పూర్తి కావడంతో టీమ్ అంతా సెలబ్రేట్ చేసుకుంది. ఈ విషయాన్ని అభిమానులతో ఎక్స్ వేదికగా పంచుకున్నారు ఎన్టీఆర్. "ఎన్నో జ్ఞాపకాలను ఇచ్చిన 'వార్ 2' చిత్రీకరణ పూర్తైంది. హృతిక్ రోషన్‌తో పనిచేయడం ఎంతో సరదాను ఇచ్చింది. అపారమైన ఆయన ఎనర్జీ లెవెల్స్ అంటే నాకెంతో అభిమానం. ఆయన నుంచి చాలా నేర్చుకున్నా. దర్శకుడు అయాన్ ముఖర్జీ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేయడానికి సిద్ధమయ్యారు" అని పేర్కొన్నారు. మరోవైపు, హృతిక్ కూడా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టి భావోద్వేగానికి గురయ్యారు. "మనసంతా భావోద్వేగాలతో నిండిపోయింది. 149 రోజుల షూట్‌లో చేసిన అద్భుతమైన యాక్షన్, వేసిన డ్యాన్సులు, అయ్యిన గాయాలు.. అన్నీ మరపురానివి. ఎన్టీఆర్‌తో కలసి పనిచేయడాన్ని గౌరవంగా భావిస్తున్నా" అని అన్నారు. ఆగస్టు 14న సినిమా విడుదల కానుంది. కియారా అద్వాణీ కథానాయిక. ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# వెయిట్ లిఫ్టింగ్‌లో భారత్‌కు మూడు గోల్డ్ మెడల్స్

ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించింది విజయ నగరం జిల్లాకు చెందిన యువతి. కడు పేదరికంలోనూ ఏషియన్ జూనియర్ వెయింట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌లో మూడు బంగారు పతకాలు సాధించి దేశం ఖ్యాతిని పెంచింది. చిన్న పల్లెటూరు నుంచి అంతర్జాతీయ వేదిక దాకా సాగిన ఆమె ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. పేదరికంలో పుట్టిన ఆ యువతి ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై నిలిచింది. తండ్రి తాపీ పనిచేస్తే తప్ప రోజు గడవని స్థితి నుండి దేశం గర్వించే స్థాయికి చేరుకుంది. విజయనగరం రూరల్ మండలం కొండకరకాంకు చెందిన రెడ్డి భవాని.. దేశం తరపున ఆసియా జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో అదరగొట్టి మూడు బంగారు పతకాలు సాధించింది. రెడ్డి భవాని తండ్రి రెడ్డి ఆదినారాయణ ఒక సామాన్య తాపీ మేస్త్రి. తండ్రి తాపీ పనిచేస్తే తప్ప రోజు గడవడం కష్టం. చిన్నతనం నుంచి తన కుటుంబం ఎదుర్కొన్న కష్టాలను చూసిన భవానీ ఎలాగైనా కష్టాల నుండి బయటపడాలని అనుకుంది. అందుకోసం ఏమి చేయాలా అని నిరంతరం ఆలోచించింది. ఈ క్రమంలోనే వెయిట్ లిఫ్టింగ్‌లో ఉన్నత స్థాయికి చేరిన పలువురు క్రీడాకారులు గుర్తుకు వచ్చారు. వారి స్ఫూర్తితో తాను కూడా వెయిట్ లిఫ్టింగ్‌లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని నిర్ణయించుకుంది. తాను వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ పొందేందుకు ఒక కోచ్ కోసం అన్వేషించింది. ఆ సమయంలో గాదిపల్లి ఆనంద్ అనే కోచ్ భవానికి శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చాడు. ఆనంద్ ఆమెకు వెయిట్ లిఫ్టింగ్‌లో అవసరమైన సలహాలు, సహాయాన్ని అందించాడు. చిన్నప్పటి నుండి క్రమశిక్షణ, కష్టపడేతత్వం ఉన్న భవాని కఠోర శిక్షణ పొందింది. అందుకు తగ్గట్టుగా ఆనంద్ ఆమెను నిరంతరం ప్రోత్సహిస్తూ ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాడు. ఈ కృషి ఫలితంగానే ఆమె ఆసియా ఛాంపియన్‌షిప్‌లో మూడు బంగారు పతకాలు సాధించి, దేశ ఖ్యాతిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లింది. భవాని తన అసాధారణ ప్రతిభ, కఠిన శ్రమతో ఈ అసామాన్య విజయాన్ని అందుకుంది. ఆదినారాయణకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. తన మొదటి కూతురి వివాహం కోసం ఇల్లు అమ్మాల్సిన ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, ఆయన రెండవ కూతురు భవానిని మాత్రం వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రోత్సహించడంలో వెనుకడుగు వేయలేదు. ఆయన ఎళ్లవేళలా భవాని విజయానికి అండగా నిలిచారు. ఇప్పుడు భవాని సాధించిన విజయంలో కోచ్ ఆనంద్, తండ్రి ఆదినారాయణ పాత్ర కీలకమని చెప్పొచ్చు. భవాని అంతర్జాతీయస్థాయిలో సాధించిన విజయానికి జిల్లావాసులతో పాటు నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# దయాల్ దీనగాథ



టీమిండియా యువ పేసర్, ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు తరఫున ఆడుతున్న యశ్ దయాల్‌పై ఒక యువతి లైంగిక వేధింపుల ఆరోపణలు చేసింది. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా నమోదు చేసింది. యువతి ఫిర్యాదు మేరకు దయాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ కేసు తీవ్రతను గుర్తించిన దయాల్ తనపై వచ్చిన ఆరోపణలపై తొలిసారి స్పందించాడు. తనపై కేసు నమోదు చేసిన అమ్మాయిపైనే యశ్ దయాల్ పలు ఆరోపణలు చేశాడు. యువతిపై చర్యలు తీసుకోవాలని ప్రయాగ్‌రాజ్ పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఇంతకీ యువతిపై యశ్ దయాల్ చేసిన ఆరోపణలు ఏమిటంటే, తనపై అనేక ఆరోపణలు చేసిన ఆ యువతి తన ఐఫోన్, ల్యాప్‌టాప్ దొంగిలించిందని దయాల్ ఆరోపించాడు. అంతేకాకుండా, తన నుంచి లక్షల రూపాయలు తీసుకుని దుర్వినియోగం చేసిందని కూడా పేర్కొన్నాడు. లైంగిక వేధింపుల ఆరోపణలపై యశ్ దయాల్ స్పందిస్తూ.. 2021లో ఈ యువతి న్స్టాగ్రామ్‌లో పరిచయం అయింది. ఆ తర్వాత ఇన్‌స్టాగ్రామ్‌లోనే మా ఇద్దరి మధ్య మాటలు పెరిగాయి. మా మధ్య ఉన్న స్నేహాన్ని దుర్వినియోగం చేసుకుని, ఆ అమ్మాయి నాకు, నా కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగోలేదని అబద్ధం చెప్పి, చికిత్స కోసమని నా దగ్గర లక్షల రూపాయలు తీసుకుంది. ఈ డబ్బు తీసుకునేటప్పుడు వీలైనంత త్వరగా తిరిగి ఇస్తానని చెప్పుకొచ్చింది. కానీ ఇప్పటివరకు ఒక్క పైసా కూడా తిరిగి ఇవ్వలేదు. అంతేకాకుండా, ఆ అమ్మాయి నా ఐఫోన్ , ల్యాప్‌టాప్ దొంగిలించింది'' అని యశ్ దయాల్ ఆరోపించాడు. ఈ విషయమై ప్రయాగ్‌రాజ్‌లోని ఖుల్దాబాద్ పోలీస్ స్టేషన్‌లో మూడు పేజీల ఫిర్యాదును కూడా నమోదు చేశాడు. ఆ యువతిపై వీలైనంత త్వరగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశాడు. జులై 7న యశ్ దయాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇందిరాపురం నివాసి అయిన ఒక యువతి ఫిర్యాదు చేసింది. యశ్ దయాల్ పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, అలాగే యశ్ దయాల్ తనను తన కుటుంబ సభ్యులకు కూడా పరిచయం చేశాడని చెప్పుకొచ్చింది. వారిని చాలాసార్లు కలిశానని ఆ యువతి ఆరోపించింది. ఇప్పుడు తనను పెళ్లి చేసుకోమని దయాల్‌ను అడిగినప్పుడు, అతను తనపై శారీరక దాడి చేశాడని ఆరోపిస్తూ యువతి ఫిర్యాదు నమోదు చేసింది. ఫిర్యాదు మేరకు దయాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీని తర్వాత యశ్ దయాల్, యువతిపై దొంగతనం, డబ్బు తీసుకున్న ఆరోపణలు చేయడం ద్వారా ఈ కేసు కీలక మలుపు తిరిగింది. ముందుముందు ఇంకేం జరుగుతుందో చూడాలి.

# శుభమన్ గిల్‌కు గంగూలి వార్నింగ్



శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీ తొలి టెస్ట్‌లో అదరగొట్టినా, సౌరవ్ గంగూలీ ఇది కేవలం హనీమూన్ పీరియడ్ మాత్రమేనని హెచ్చరించారు. రాబోయే మ్యాచ్‌లలో ఒత్తిడి పెరుగుతుందని, గిల్ ఎలా రాణిస్తాడో చూడాలని గంగూలీ అన్నారు. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో శుభమన్ గిల్ అద్భుతంగా ఎగబాకాడు. భారత టెస్ట్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ తన కెరీర్‌ను అద్భుతంగా మొదలుపెట్టాడు. తన కెప్టెన్సీలో భారత జట్టు ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో విజయం సాధించింది. అయితే, మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ భారత కెప్టెన్‌ను రాబోయే కష్టాల గురించి ముందుగానే హెచ్చరించారు. భారత జట్టు మాజీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ శుభ్‌మన్ గిల్ ప్రదర్శనను ప్రశంసించారు. అయితే అసలైన కెప్టెన్సీ సవాలు ఒత్తిడి పెరిగినప్పుడు మొదలవుతుందని ఆయన గుర్తు చేశారు. సౌరవ్ గంగూలీ మాట్లాడుతూ.. "బ్యాటింగ్ చేస్తూ అతని అత్యుత్తమ ప్రదర్శనను నేను ఇప్పటివరకు చూశాను. అతను ఇప్పుడు కెప్టెన్ అయ్యాడు. ఇది హనీమూన్ పీరియడ్. కానీ కాలంతో పాటు అతనిపై ఒత్తిడి పెరుగుతుంది. రాబోయే మూడు టెస్ట్ మ్యాచ్‌లలో ఈ ఒత్తిడి మరింత పెరుగుతుంది'' అని అన్నారు. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్నాడు. అతను మొదటి రెండు టెస్ట్ మ్యాచ్‌లలో 146.25 సగటుతో 585 పరుగులు చేశాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన రెండో టెస్ట్‌లో గిల్ మొదటి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ, ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో 161 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. తన ఈ అద్భుత ప్రదర్శనతో భారత్ ఇంగ్లాండ్‌పై రెండో టెస్ట్‌లో 336 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. అంతకుముందు లీడ్స్‌లో జరిగిన సిరీస్ మొదటి మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో అతను 147 పరుగులు చేశాడు. లీడ్స్‌లో భారత్ మొదటి టెస్ట్ మ్యాచ్‌ను ఐదు వికెట్ల తేడాతో ఓడిపోయింది. మూడో టెస్ట్ గురువారం నుంచి లార్డ్స్‌లో ప్రారంభం కానుంది. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో గిల్ దూకుడు సిరీస్‌కు ముందు 24 ఏళ్ల శుభ్‌మన్ గిల్ 23వ స్థానంలో ఉన్నాడు. బుధవారం విడుదలైన ఐసీసీ టెస్ట్ బ్యాట్స్‌మెన్‌ల తాజా ర్యాంకింగ్స్‌లో 15 స్థానాలు ఎగబాకి తన కెరీర్‌లో అత్యుత్తమ ఆరో ర్యాంకుకు చేరుకున్నాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో చేసిన 430 పరుగులతో, అతను ఇప్పటివరకు రెండు టెస్టుల్లో మొత్తం 585 పరుగులు చేశాడు. ఇంకా సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. గిల్ కెరీర్‌లో అంతకు ముందు అత్యుత్తమ ర్యాంకింగ్ 14, అది సెప్టెంబర్ 2023లో సాధించాడు.

# ఇక్కడ భారత జట్టుకు చేదు అనుభవాలు ఎక్కువ..

లార్డ్స్ మైదానంలో టీమిండియా టెస్ట్ రికార్డు అంతగా ఆశాజనకంగా లేదు. 19 మ్యాచ్‌లలో 12 మ్యాచ్‌లలో ఓటమి చవిచూసింది. కేవలం 3 విజయాలు మాత్రమే సాధించింది. చివరగా 2014లో ఎంఎస్ ధోని కెప్టెన్సీలో గెలిచింది. తర్వాత టీమిండియా 2021లో ఇంగ్లాండ్‌ను ఘోరంగా ఓడిరచింది. భారత్, ఇంగ్లాండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో మూడో మ్యాచ్ రేపు అంటే జూలై 10 నుంచి లండన్‌లోని చారిత్రాత్మక మైదానం లార్డ్స్?లో జరగనుంది. భారత జట్టు ఈ మైదానంలో ఇప్పటివరకు మొత్తం 19 మ్యాచ్‌లు ఆడిరది. లార్డ్స్ పిచ్‌పై భారత జట్టుకు రికార్డు అంతగా బాగోలేదు. భారత్ గెలిచిన మ్యాచ్‌ల కంటే డ్రా చేసుకున్న మ్యాచ్‌లే ఎక్కువగా ఉన్నాయి. ఈ చారిత్రాత్మక మైదానంలో భారత జట్టు అంతగా రాణించలేకపోయింది. భారత జట్టు రికార్డు చాలా పేలవంగా ఉంది. భారత్ ఈ మైదానంలో మొత్తం 19 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిరది. ఇందులో 12 మ్యాచ్‌లలో ఓటమి చవిచూసింది. కేవలం 3 మ్యాచ్‌లలో మాత్రమే విజయం సాధించింది. ఇక 4 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. ఈ మూడు విజయాలలో రెండు, గత మూడు పర్యటనలలో సాధించినవే కావడం గమనార్హం. భారత జట్టు మొదటగా 1986లో కపిల్ దేవ్ కెప్టెన్సీలో ఈ మైదానంలో విజయం సాధించింది. ఆ తర్వాత రెండో విజయం సాధించడానికి భారత జట్టు ఏకంగా 28 సంవత్సరాలు ఎదురుచూడాల్సి వచ్చింది. టీమిండియా ఆ తర్వాత 2014లో ఎంఎస్ ధోని కెప్టెన్సీలో గెలిచింది. ఈ మైదానంలో మూడో, చివరి విజయం విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో లభించింది. టీమిండియా 2021లో ఇంగ్లాండ్‌ను ఘోరంగా ఓడిరచింది. భారత్, ఇంగ్లాండ్ మధ్య ఇప్పటివరకు సిరీస్‌లో రెండు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో ఇంగ్లాండ్ భారత జట్టును 5 వికెట్ల తేడాతో ఓడిరచింది. ఇంగ్లాండ్ 371 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించింది. ఆ తర్వాత రెండో మ్యాచ్‌లో పుంజుకున్న భారత జట్టు, ఇంగ్లాండ్‌ను 336 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసింది. భారత జట్టు ఇంగ్లాండ్ ముందు 608 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఇంగ్లాండ్ జట్టు ఈ లక్ష్యాన్ని ఛేదించలేక కేవలం 271 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో సిరీస్ 11తో సమంగా ఉంది. లార్డ్‌స్‌లో జరిగే ఈ మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌లో ఆధిక్యం సాధించాలని ఇరు జట్లు పట్టుదలగా ఉన్నాయి.





# స్వైటెక్ సూపర్ విజయం

మహిళల సింగిల్స్ మాజీ వరల్డ్ నం.1, పోలాండ్ భామ ఇగా స్వైటెక్ వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌లో సెమీఫైనల్‌కు చేరుకుంది. వింబుల్డన్ టైటిల్ వేటలో అసమాన ఆటతీరుతో రెచ్చిపోతున్న స్వైటెక్.. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో లుడిమిల లామ్సోనోవపై వరుస సెట్లలో విజయం సాధించింది. 62, 75తో రష్యా అమ్మాయిని చిత్తు చేసిన స్వైటెక్ సూపర్ ఫామ్ కొనసాగించింది. మూడు ఏస్‌లు, ఐదు బ్రేక్ పాయింట్లు సాధించిన స్వైటెక్.. ఏ దశలోనూ ఇబ్బంది పడలేదు. తొలి సెట్‌ను 62తో అలవోకగా నెగ్గింది. రెండో సెట్లో 55తో సమ్సోనోవ పోటీ ఇచ్చే ప్రయత్నం చేసింది. 75తో మ్యాచ్‌ను రెండో సెట్లోనే ముగించిన స్వైటెక్ సెమీఫైనల్ బెర్త్ బుక్ చేసుకుంది. పాయింట్ల పరంగా 7559తో పైచేయి సాధించిన స్వైటెక్.. సొంత సర్వ్‌లో 8 గేములు గెలుపొందింది. ఓవరాల్‌గా స్వైటెక్ 13 గేములు నెగ్గగా.. సమ్సోనోవ ఏడు గేమ్ పాయింట్లతోనే సరిపెట్టుకుంది. మరో క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో స్విస్ అమ్మాయి బెలింద బెన్సిక్ సూపర్ విక్టరీ నమోదు చేసింది. ఏడో సీడ్ రష్యా అమ్మాయి మిరా అండ్రీవను వరుస సెట్లలో టైబ్రేకర్లలో ఓడిరచింది. 76(73), 76(72)తో వరుస సెట్లు టైబ్రేకర్‌కు దారితీశాయి. టైబ్రేకర్‌లో పైచేయి సాధించిన బెన్సిక్.. అండ్రీవను ఇంటిదారి పట్టించింది. అండ్రీవ, బెన్సిక్ చెరో బ్రేక్ పాయింటే సాధించటంతో మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. పాయింట్ల పరంగా 94 85తో బెన్సిక్ ఆధిపత్యం చూపించింది. నేడు జరిగే సెమీఫైనల్స్‌లో టాప్ సీడ్ అరినా సబలెంక (బెలారస్), అనిసిమోవ (అమెరికా) తలపడనుండగా.. బెన్సిక్, స్వైటెక్‌లు మరో సెమీస్‌లో తాడోపేడో తేల్చుకోనున్నారు.

## టెన్నిస్ ప్లేయర్ జీవితాన్ని చిదిమేసిన 'సోషల్ మీడియా పోస్ట్'!



హర్యానా రాష్ట్రంలో దారుణం చోటు చేసుకుంది. ఇన్ స్టా రీల్స్ చేసిందని కన్న కూతురి జీవితాన్ని చిదిమేశాడు తండ్రి. టెన్నిస్‌లో ఎంతో భవిష్యత్ ఉన్న 25 ఏళ్ల రాధికా యాదవ్‌ను తండ్రి హత్య చేశాడు. గురుగ్రామ్ సుశాంక్ లోక్ ఫేజ్ 2లో నివాసముంటున్న రాధికా యాదవ్‌ను.. తండ్రి గన్‌తో కాల్చి చంపాడు. ఇన్ స్టా రీల్‌కు సంబంధించి తండ్రీ కూతుళ్ల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఇన్ స్టా రీల్ ఎందుకు చేశావని ఆగ్రహించిన తండ్రి.. కూతుర్ని నిలదీశాడు. ఈ విషయంపై కూతురు ఎదురు తిరిగింది. దాంతో కోపాన్ని కంట్రోల్ చేసుకోలేని తండ్రి తన వద్ద ఉన్న గన్‌తో కాల్చి హత్య చేశాడు.

తన లైసెన్స్‌డ్ రివాల్వర్‌తో కూతుర్ని తన ఇంటి వద్దే కాల్చి చంపాడు. కూతుర్ని చంపడమే లక్ష్యంగా మూడు రౌండ్ల కాల్పులు జరిపాడు. దాంతో తీవ్ర గాయాలపాలై రక్తపు మడుగులో ఉన్న ఆమెను ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. ఆమె మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కూతుర్ని హత్య చేసిన విషయాన్ని తండ్రి అంగీకరించడంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. లైసెన్స్‌డ్ రివాల్వర్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in